ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శుక్రవారం ၊ 19 సెప్టెంబర్ 2025 ၊ ■ 15 పేజీలు




# అదను దాటుతున్నా.. అందని యూరియా

■ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం ■ పలుచోట్ల రాస్తారోకోలు ■ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు


# మత్తుతో జీవితాలు చిత్తు

పోలీస్ శాఖకు సవాల్‌గా మారిన గంజాయి అక్రమ రవాణా, సాగు, విక్రయం

- నిర్మల్ జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి సాగు, వాడకం..
- సిగరెట్ల రూపంలో విక్రయాలు
- భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్న యువత..
- బస్తీల్లో చెలరేగిపోతున్న గంజాయి మూకలు..
- రోడ్లపై వెళ్లే వారిపై దాడులకు పాల్పడుతున్న వైనం
- పోసులు నియంత్రించినా ఆగని గంజాయి సరఫరా
- జిల్లా ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు
- తల్లిదండ్రుల సహకారం అవసరమంటున్న వైద్యులు..

నిర్మల్ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వాడకం అతివేగంగా విస్తరిస్తోంది. గంజాయి సరఫరా, కల్తీకల్లు, మత్తు పదార్థాలు రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తూ వ్యసన పరులకు అడ్డాగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. గంజాయికి బానిసలుగా మారి మానసికంగా కుంగిపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొంత కాలం నుంచి జిల్లా అంతటా విచ్చలవిడిగా గంజాయి విక్రయాలతో పాటు ఆ గంజాయికి బానిసలుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా యువకులు గంజాయికి బానిసలుగా మారి వ్యసనపరులుగా మారుతున్నారు. పోలీసులు గాంజా గస్తీ పేరిట విస్తృత తనిఖీలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ దీనిని నివారించడం మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నడుస్తున్న డీ అడిక్షన్ సెంటర్‌కు చికిత్స భారీగా వస్తుండడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.





7లో



15

## రూ.60కోట్లతో కాగజ్‌నగర్..
# రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

■ వందే భారత్ హాల్టింగ్ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్

రూ.60 కోట్లతో కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు ఎంపీ గొడం నాగేష్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్-నాగపూర్ వందే భారత్ హాల్టింగ్‌ను ఎమ్మెల్యే హరీష్ బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా మోడీ పాలన కొనసాగుతోందన్నారు. వందే భారత్‌హాల్టింగ్‌తో జిల్లా ప్రజలకు రైల్వే సౌకర్యం పెరిగిందన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు
# పటిష్ట ఏర్పాట్లు

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని గురువారం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ పరిసరాలను అధికారులు, పూజారులతో కలిసి పరిశీలించారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.





7

# వాగు దాటలేక.. రాత్రంతా బడిలోనే

- 'గిరి'పాఠశాలల ఉపాధ్యాయుల గోస వర్ణనాతీతం
- చివరకు గ్రామస్తుల సాయంతో వాగు దాటిన టీచర్లు
- చెల్కగూడ వాగుపై వంతెన నిర్మించాలంటూ అర్ధనగ్న ప్రదర్శన

ఎగువన కురిసిన వర్షానికి పొంగి పొర్లుతున్న వాగును దాటలేక ఉపాధ్యాయులు బడిలోనే రాత్రంతా ఉండాల్సిన ఘటన ఆసిఫాబాద్ మండలంలో చోటు చేసుకుంది. అత్యంత మారుమూల గ్రామాలైన వాడిగొంది, వాడిగొంది (ఎన్), చెల్కగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విధులు ముగిసిన అనంతరం ఆసిఫాబాద్‌కు ప్రయాణమయ్యారు. దారిలో వాగు ఉప్పొంగడంతో గంటల తరబడి నిరీక్షించి చేసేదేమి లేక చెల్కగూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలోనే ఉండిపోవాల్సి వచ్చింది. రాత్రి అక్కడే బస చేశారు.



## ఏఎస్పీ కాజల్ సింగ్‌కు
# ఎస్పీగా పదోన్నతి

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణా రావు
- యథాస్థానంలో పోస్టింగ్..
- అభినందనలు తెలిపిన ఎస్పీ, పోలీసు సిబ్బంది

## వన్యప్రాణుల సంరక్షణే
# ప్రధాన లక్ష్యం

- వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ టాస్క్‌ఫోర్ కమిటీ ఏర్పాటు
- కేసులను వేగంగా పరిష్కరించాలి
- కుమ్రంభీం ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్ కుమార్



# అదను దాటుతున్నా.. అందని యూరియా

- అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం
- పలుచోట్ల రాస్తారోకోలు.. ధర్నాలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల నినాదాలు
- రైతు వేదికలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద తెల్లవారు జామునుంచే యూరియా కోసం బారులు
- సరిపడా యూరియా అందజేయాలని డిమాండ్







**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
రైతులు యూరియా సకాలంలో అందక అవస్థలు పడుతున్నారు. పత్తి, వరి పంటకు సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో ఎదుగుదల లేకుండా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నెల రోజులు దాటుతున్నా..జిల్లాలోని రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. అదను దాటితే దిగుబడి వస్తుందో రాదోనని రైతులు ఆందోళన చెందతున్నారు. యూరియా కోసం రైతులు తెల్లవారే సరికి యూరి యా పంపిణీ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. నెల రోజులుగా యూరియా దొరకకపో వడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజా ప్రతినిధులు యూరియా కోసం పట్టించుకోవడం లేదని, అధికార యంత్రాంగం రైతులకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమ య్యారని రైతులు చెబుతున్నారు. ధర్నాలు, నిరసనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొంత మంది రైతులు తమ చేన్లల్లో, పొల్లాల్లో యూరియాకు బదులు ప్రత్యమ్నాయంగా ఇతర ఎరువులను వినియోగిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 1.23 లక్షల మంది రైతులు ఉండగా 4.5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అందులో 3,35,363 ఎకరాలు పత్తి పంట, 56,861 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. 30,430 ఎకరాల్లో కంది, 1000 ఎకరాల్లో మొక్కజొన్న, 1500 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. ఖ్లిలో ఆరిస్టు నెల వరకు 42,062 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 36 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. పీఏసీఎస్, డీసీఎంఎస్, హాకా, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే సంఘాలు 71తో పాటు ప్రైవేటు ఎరువులు, ఫర్టిలైజర్ షాపులు 380 వరకు ఉన్నాయి. వీటి ద్వారా యూరి యా విక్రయిస్తున్నారు. జిల్లాలో గత ఖరీఫ్ ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 42,062,289 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. ప్రస్తుత సీజన్లో అదే సమయంలో 36వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. ప్రస్తుతం 260 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా వాటిని సరఫరా చేస్తున్నారు. అయితే సీజన్ మొత్తంలో ఎకరాకు రెండు బస్తాల యూరియా నాలుగు దఫాల్లో వాడాల్సి ఉండగా రైతులు మాత్రం రెట్టింపు వాడుతుండడంతో కొరత ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ఎకరాకు ఒక బస్తా రూ. 266 చొప్పున విక్రయిస్తు న్నారు. చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారు. కానీ యూరియా కోసం పడిగాపులు కాస్తుండడంతో ఇదే అదునుగా కొందరు దళారులు బస్తాకు రూ. 600 - 800 వరకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను రైతులకు కట్టబెడుతున్నట్లు ఆరోపణలున్నాయి.కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రభుత్వం సరిపడా యూరియా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

# వాగుపై వంతెన కోసం అర్ధనగ్నంగా నిరసన



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం పోరాట గడ్డ అయిన ఆసిఫాబాద్ జిల్లాలో మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు, వంతెనలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో వారు పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని వాడిగొంది గ్రామస్తులు వాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ వాగు పీకల్లోతు నీటిలో దిగి అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వానాకాలంలో వరదల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. వాగు వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని చెప్తున్నారు. మరోవైపు నిన్న వాగు ఉధృతికి ఇంటికి వెళ్లకుండా స్కూల్‌లో బస చేసిన మహిళ టీచర్‌లు స్వాతి, సుమలత గురువారం ఉదయం కొంత మేరకు వాగు ప్రవాహం తగ్గడంతో ఇద్దరు పీకల్లోతు నీటిలో గ్రామస్తుల సహకారంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటారు. అయితే మహిళా టీచర్ల ధైర్య సాహసాన్ని పలు గ్రామస్తులు కొనియాడారు. అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటలేక ప్రాణాలు పోయినా సందర్భాలు సైతం ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధు లు, అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## కుక్కలు, కోతుల బెడదకు చర్యలు తీసుకోండి

**భైంసా, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కుక్కలు కోతుల బెడదకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని గురువారం కిసాన్‌గల్లి మహిళలు మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కాలనీలలో తిరగాలంటే ఊర కుక్కల బెడదతో భయంగా ఉందని తెలిపారు. ఇప్పటికే పలువురికి కుక్కలు కాటేసేయని, కోతులు సైతం ఇండ్లలో చొరబడి వీర విహారం చేస్తున్నాయని కమిషనర్ కి తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ తొందర్లోనే తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## సాగునీటి వివరాలు నమోదు చేయాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని అన్ని సాగునీటి వనరుల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచంద్ర రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 7వచిన్న తరహా నీటి వనరుల గణనలో భాగంగా మంచిర్యాలలోని 3 చెరువులకు సంబంధించి క్షేత్రస్థాయిలో వివరాలు, ఫోటోలను యాప్ లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని సాగునీటి వనరుల వివరాలను యాప్ లో నమోదు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపగణాంక అధికారులు గురువ య్య, సురేష్ కుమార్, మండల సహాయ గణాంక అధికారులు హన్మోహన్, సురేందర్‌లు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో సరుకులు ఇవ్వడం లేదని నిరసన



**వాంకిడి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అంగన్వాడీల ఇష్టారాజ్యంగా మరింది. మరి ముఖ్యంగా వాంకిడి మండలంలో వారం రోజుల క్రితం చిన్న బెండార అంగన్వాడీ టీచర్ విధులకు రావడం లేదని.. గత ఆరు నెలలుగా పౌష్టికాహారం ఇవ్వడం లేదని.. ఆ అంగన్వాడీ టీచర్ మాకొద్దని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని సీడీపీవోకు ఫిర్యాదు చేశారు. ఇక తాజాగా ఈ రోజు మండలంలో ఎనోలి కొలాంగూడ గిరిజన గ్రామంలో రెండు మూడు నెలలుగా పౌష్టికాహారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ అంగన్వాడీ కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అంగన్వాడీ టిచర్‌ను అడిగితే కేంద్రానికి సక్రమంగా సరుకులు రావడం లేదని చెబుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ పై పట్టింపు లేకపోవడంతో అంగన్వాడీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

## అంబులెన్స్‌లో కవలలకు జన్మనిచ్చిన మహిళ

**మామడ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కమల్ కోట్ గ్రామానికి చెందిన జాదవ్ సంగీత గురువారం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది గ్రామానికి వెళ్లగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 వాహనంలో నిర్మల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో వాహనాన్ని నిలిపి సురక్షితంగా డెలివరీ చేశారు. సంగీతకు కవలలు మగ, ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటి సురేష్, పైలట్ హాఫీజ్‌లు చికిత్స చేసి నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.



## గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు భావి తరాలకు తెలియజేయాలి



**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు అందరికీ ఆదర్శం అని,వాటికి సంబంధించిన రచనలు పుస్తకాలను భావి తరాలకు అందించేలా వాటిని మాతృ భాషలోకి అనువదించి భద్రపరచాలి అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ వారిచే నిర్వహించబడుతున్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థను సందర్శించారు. గిరిజనుల సంస్కృతి జీవిన విధానాలు గురించి రచించిన "ది రాజ్ గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్" అనే పుస్తకం చదివి భావితరాలకు ఈ రచనలు, ఈ జ్ఞాన సంపద అందించేలా వాటిని స్థానిక భాషల్లోకి అనువదించి భద్రపరచాలన్నారు.

# పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి



## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు సహకరించి కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సిపిఓ జీవరత్నం, ఎడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డిఎస్ఓ రాజేందర్, డిఎం సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ ఆలయంలో చోరీ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లతో పాటు ఆలయాలను సైతం టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని కాపువాడ వార్డు నెంబర్ 06 లోని పంచముఖి హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. తాళం వేసి ఉన్న ఆలయం గేటుతో పాటు గుడి ముఖద్వారం తలుపులకు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

## బెజ్జూర్ పీఏసీఎస్ సెక్రటరీ సస్పెండ్

**బెజ్జూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఇన్చార్జి సెక్రటరీ జక్కుల సత్యనారాయణ గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ రాథోడ్ బిక్కు ఉత్తర్వులు జారీ చేశారు. బెజ్జూరు సహకార సంఘంలో జరిగిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థా యిలో విచారణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. విధుల్లో నెగ్లిజెన్సీ వహించిన కారణంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. యూరియా పంపిణీలో మండల వ్యవసాయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపనున్నట్లు పేర్కొన్నారు.

## రైల్వే స్టేషన్ రోడ్డులో కొండచిలువ హల్ చల్



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో భారీ కొండచిలువ రోడ్డు దాటుతూ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొండచిలువను చూసేందుకు జనాలు భారీగా గుమిగూడారు. కాసేపటికి తర్వాత కొండచిలువ సమీపంలోని పేపర్ మిల్ గోడ ఎక్కి మిల్లు లోపలికి వెళ్లింది. అప్పటి వరకు జనాలు కొండచిలువను ఆసక్తిగా చూస్తున్నారు. తర్వాత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

## జన్నారం ఏఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**



జన్నారం పోలీస్ స్టేషన్‌లో నూతన ఏఎస్సైగా గొల్లపల్లి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్ గతంలో పెద్దపల్లి జిల్లా బంసత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. రెండు నెలల క్రితం ఏఎస్ఐగా పదోన్నతి పొంది, మంచిర్యాల జిల్లా జన్నారం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

## పింఛన్ పెంచాలని తహసీల్దార్‌కు వినతి



**సారంగాపూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన పింఛన్ డబ్బుల పెంపు హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సంధ్యారాణికి వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, ఆధ్వర్యంలో గురువారం నాయకులు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పెన్షన్ దారుల విషయంలో స్పందించకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇచ్చినా హామీలను అమలు చేయాలని లేని పక్షంలో హైదరాబాద్ మహానగరంలో జరగబోయే ఎన్నికల్లో మా సత్తా ఏంటో చూపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కత్తెరపాక శంకర్, ఎంఎస్పి అసెంబ్లీ ఇంచార్జ్ కొనిమల రాజు, వికలాంగుల మండల అధ్యక్షులు బొల్లెడ రమేష్ రెడ్డి, దశరథ్, శేఖర్, విజయలక్ష్మి సాయి, గంగమని, మాగ్బుల్, విజయలక్ష్మి, పోశెట్టి, రాజు పాల్గొన్నారు.

## కేజీబీవీలో బతుకమ్మ సంబరాలు



**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నర్సాపూర్ మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఎస్ఓ వీణ ఆధ్వర్యంలో రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారుచేసి కోలాటం చేస్తూ ఈ సంబరాలు జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మదన్ లాల్ డింగ్రా జయంతి

**మందమర్రి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
స్వాతంత్ర్య సమర యోధులు మదన్‌లాల్ డింగ్రా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సింగరేణి హైస్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ వీరుడు సింగరేణి ఎస్అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్వల్ మదన్ లాల్ డింగ్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేసి విద్యార్థులకి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ వీరుడు రాజేష్ పివ్వాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె పురుషోత్తంలు మాట్లాడారు. భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొంటున్న వినాయక్ దామోదర్ సావర్కర్, శ్యామ్‌జీ కృష్ణ వర్మలతో పరిచయం కాగా వారి ప్రోత్సాహంతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నాడన్నారు.





## నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

**మందమర్రి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరమని నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు దుర్గం కుమారస్వామి కోరారు. మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన మల్యాల శ్రీనివాస్ కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.52 వేల చెక్కును గురువారం ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కొరకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సతీష్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.




## న్యాయం జరిగే వరకు పోరాడాలి

**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
గ్రూప్-1 ఉద్యోగ నియామకాలు భాగంగా జరిగిన అవకతవకలను ఖండిస్తూ అక్రమ అరెస్టు కాబడిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి, జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన యువ నాయకులు, నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఖానాపూర్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బుక్య జాన్సన్ నాయక్ అభినందించారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలను చర్చించుటకు అఖిలపక్ష విద్యార్థి సంఘాలుగా, నిరుద్యోగులుగా ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి వెళుతున్న సందర్భంలో ప్రసాద్ నేతను ఆ సమావేశ ప్రాంగణంలో అరెస్టు చేసి అక్రమంగా పోలీస్ స్టేషన్ కు తరలించి తన గొంతునొక్కారు. ఈ సందర్భంగా ప్రసాద్ నేత మీడియాతో మాట్లాడుతూ.. గ్రూప్-1లో జరిగిన అవకతవకల పైన స్పష్టమైన అవగాహన కలిగి సభ్యసమాజానికి తెలియజేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసపూరిత కుట్రను బహిర్గతం చేస్తారనే భయంతో కనీసం రౌండ్ టేబుల్ సమావేశం కూడా నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రూప్ 1 ఉద్యోగ నిర్వహణ, మూల్యాంకనం చేసిన విధానంలో జరిగిన తప్పిదాలను, దానికి సంబంధించిన ఆధారాలను నిరుద్యోగుల పక్షాన హైకోర్టుకు సమర్పించి గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయి. తిరిగి పేపర్ కరెక్షన్ లేదా మెయిన్స్ ఎగ్జామ్ ను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని తీర్పునివ్వడం అనేది నిరుద్యోగులు వారి పక్షాన పోరాడిన ప్రతి ఒక్కరి విజయంగా ప్రసాద్ నేత తెలిపారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని న్యాయం కోసం బాధితులకు అండగా ఉండాలని, ప్రతిపక్షంలో ఉంటూ ప్రజా గొంతుకుగా వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలని పార్టీ నేతల్ను కేటీఆర్ జాన్సన్ నాయక్ లు ప్రసాద్ నేతకు సూచించారు.



# వసతి గృహాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

గత ఏడు రోజులుగా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన రాష్ట్ర ప్రభుత్వానికి, గిరిజన సంక్షేమ శాఖ అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్టు లేకపోవడం కార్మికుల పట్ల వారికున్న చిత్తశుద్ధిని ప్రదర్శిస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. గురువారం సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాలలో డైలీ వేజ్ ఔట్సోర్సింగ్, కాంటినిజెంట్ పేర్లతో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. కనీస వేతనాలు చెల్లించకుండా ఇచ్చే అరకొర వేతనాలను నెలల తరబడి చెల్లించకుండా కార్మికులను పస్తులు ఉంచుతున్నదని పేర్కొన్నారు. గత 6 నెలలుగా వేతనాలను చెల్లించకపోతే కార్మికులు కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని గిరిజన శాఖ అధికారులను ప్రశ్నించారు. వెంటనే ఏకకాలంలో పెండింగ్లో ఉన్న వేతనాలను కార్మికుల ఖాతాలో జమ చేయాలని, కార్మికులు ఇదివరకే తీసుకుంటున్న వేతనాలను తగ్గిస్తూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 64 ను వెంటనే రద్దు చేయాలన్నారు. అధికారులు వెంటనే రాష్ట్ర జేఏసీతో చర్చలు జరిపి, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కార్యచరణ రూపొందించాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా నాయకులు ఆత్రం సోనేరావ్, వెంకట్రావు, కైలాష్, కపిల్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ విరాళం

**ఉట్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్‌లో చదవుతున్న బికామ్ విద్యార్థులకు టి.జి జెన్ కో కంపెనీ హైదరాబాద్ ఉద్యోగులు ఆర్. చంద్రశేఖర్, సి. హెచ్. శివ, చరణ్‌లు కంప్యూటర్‌ను విరాళంగా అందించారు. విద్యార్థులకు చేసిన ఈ సహాయము మరువలేనిది అని కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ అన్నారు. దాతలకు విద్యార్థుల తరుపున కామర్స్ విభాగం తరుపున కళాశాల తరుపున ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, కామర్స్ అధ్యాపకులు రాజశేఖర్,సుధాకర్, పూర్ణ చందర్, రాయలింగు తదితరులు ఉన్నారు.

## పొలంలో గంజాయి సాగు



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

గంజాయి సాగు కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలంలోని కేస్లాపూర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేశారు. ఈ తరుణంలో కినక గోపాల్ వ్యవసాయ పొలంలో పది గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. గంజాయి స్వాధీనం చేసుకుని అతని పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

అన్ని పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సాయన్న తెలిపారు.గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ లో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతి కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.రానున్న దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. భారతదేశం భిన్న సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. వదంతులను నమ్మవద్దనీ అన్నారు.డీజెలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను తప్పని సరిగ్గా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ



పెద్దలు డోంగ్రే మారుతి, మోరే దీలిప్,ఎండి మసూద్, షేక్ సుఫియాన్, మీర్జా జిలానీ బెగ్, టేహారే గణేష్, ఆరేల్లి రాజలింగం, కైలాష్, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలి



**జైనూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 21న అసిఫాబాద్ జిల్లాలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ గురువారం పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 12 ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారానే సహజ, ప్రమాద, మరణం, పాక్షిక, పూర్తిస్థాయి, అంగవైకల్యానికి ఇచ్చే సంక్షేమ నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బదిలీ చేసిన రూ. 346 కోట్లను వెంటనే వాపస్ తీసుకోవాలని వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని వెంటనే అనుభవజ్ఞులైన ట్రేడ్ యూనియన్ నాయకులతో నియమించా లన్నారు. ప్రభుత్వంలోని అధికారులు, వెల్ఫేర్ బోర్డు నిధులను తమ ఇష్టానుసారం బదిలీ చేయడం ఖర్చు పెట్టడం చట్ట విరుద్ధమన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు కనీసం రూ. 9వేల పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, పెళ్లి కానుక ప్రసూతి కానుక రూ. 30 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని, సహజ మరణం ఇస్తున్న లక్షా 30 వేలను రూ. 5 లక్షలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి ఆనందరావు, రామచందర్, వెంకన్న, మహేష్, సదయ్య బాలాజీ, ప్రకాష్, దుర్గయ్య, షేక్ అజీమ్ పాల్గొన్నారు.



## హిందీ భాష దేశ ప్రజల ఐక్యతను తెలుపుతుంది

**ఉట్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హిందీ భాష గొప్పతనాన్ని అధ్యాపకులు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. హిందీ భాష దేశ ప్రజల ఐక్యతను తెలుపుతుందన్నారు. హిందీ భాషాభివృద్ధికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఆనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ రాణి, డాక్టర్ అనిత,స్వామి, ముజీబ్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన వైద్యులు



**బెజ్జూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు శ్రావణ్, మన్విత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వైద్య అధికారి అవినాష్ పదోన్నతిపై జిల్లా వైద్యశాలకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులు మారుమూల ప్రాంతంలో వైద్య సేవలు అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

## అటవీ కార్యాలయం ఎదుట ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన

**సిరికొండ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని అటవీ కార్యాలయం ఎదుట ఇందిరమ్మ లబ్దిదారులు ఆందోళనకు దిగారు. ఇసుకతో పాటు 40 మి.మి. స్టోన్ గిట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకోవటంతో వారు నిరసనకు దిగారు. నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తే నిర్మాణం చేపట్టేది ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతి లేనిదే అక్రమంగా ఇసుకను, ఇతర సామగ్రిని తరలిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా అధికారులు వారికి తెలిపారు. ఇలాగైతే ఇందిరమ్మ ఇండ్లను ఎలా కట్టుకోవాలని లబ్ధిదారులుత నిరసన వ్యక్తం చేశారు.



## చేతివృత్తి కులాలకు పూర్వవైభవం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

చేతి వృత్తి కులాలకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను బీసీ మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో కృషి చేసానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడులు జోగు రామన్న అన్నారు. విశ్వకర్మ ఆలోచన విధానం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నా రు. శ్రీ విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ ఆరాధనోత్సవాల్లో మాజీ మంత్రి పాల్గొన్నారు. మొదట కమిటీ సభ్యులతో కలిసి విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. విశ్వకర్మ విగ్రహానికి, వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జోగు రామన్న ప్రసంగిస్తూ కులవృత్తులకు జీవం పోసిన విశ్వకర్మలు ఆలోచన విధానం ఎంతో స్ఫూర్తివంతమైందన్నారు. బీసీలోని 27 కుల సంఘాలకు చెందిన బీసీ భవన్‌ను నాలుగున్నర ఎకరాలలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూమి పూజ చేసుకోవ డం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్సింలు, దశరథ్, యూత్ ప్రెసిడెంట్ సూర్యకాంత్ పాల్గొన్నారు.




## రేపు కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్.పీఆర్.డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎన్.పీఆర్.డీ జిల్లా అధ్యకుడు మెస్రం నగేష్ పేర్కొన్నారు. దీక్షలో వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య భవనంలో సమావేశంఏర్పాటు చేసి మాట్లాడారు. 2023 డిసెంబర్ నాటికీ జనవరి లోపల వికలాంగులకు రూ.6 వేలను పింఛన్ పెంచుతామని చెప్పిన ప్రభుత్వం.. అధికారంలో వచ్చి 22 నెలలు గడుస్తున్నా పింఛన్ ఇదివరకు పెంచలేదన్నారు. ఈ నెల చివరి వరకు కొత్త పింఛన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 5% వికలాంగుల ఇందిరమ ఇల్లులు మంజూరు చేయాలన్నారు. 100% రాయితీ సబ్సిడీలోన్ ప్రతి మండల కేంద్రంలో 20 యూనిట్ గా పెంచాలన్నారు. వికలాంగుల సపరేట్ శాఖ ఇవ్వాలని చదువుకున్న వికలాంగులకు బ్యాకలాగ్ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అరిఫాబేగం, ఉపాధ్యక్షుడు కే ఆశన్న, సహాయ కార్యదర్శి చుక్కబోట్ల పోచన్న, కోశాధికారి కుమ్రం శత్రుఘన్ పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో ప్రతిభ



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

గద్వాల జిల్లాలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్టిక్ తైక్వాండో ఛాంపియన్స్ పోటీల్లో బెల్లంపల్లికి చెందిన 8 మంది రైల్వే కార్మికులకు పిల్లలు పతకాలు సాధించారు. బెల్లంపల్లి రైల్వే ఇన్స్టిట్యూట్‌లో విజేతలకు ఏడిఈఎన్ గోపి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పతకాలు సాధించడంలో కీలక పాత్ర వహించిన కోచ్ అజయ్‌లు రైల్వే కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు కృష్ణ ప్రసాద్, శ్యామ్, ఆర్ పిఎఫ్ ఏఎస్ఐ రాథోడ్, రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీరమేష్, మంచిర్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి రామారావు, వెంకటస్వామి, కమిటీ సభ్యులు రమేష్, అనిల్, మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల అవసరం.. మేరకు యూరియా

**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ ఫార్మర్ సొసైటీ పరిధిలో రైతులందరికీ సరిపడే విధంగా యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ ధర్మాజీ రాజేందర్ అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో యూరియా పంపిణి తనిఖీ చేసి రైతుల అవసరముందరకు మాత్రమే యూరియా బ్యాగులు తీసుకోవాలని సూచించారు. యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.



# విద్యార్థుల కోసం వచ్చిన కిట్లతో ప్రైవేటు దందా : ప్రధానోపాధ్యాయుడి నిర్వాకం

**కోటపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

కోటపల్లి మండలం విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ అడ్డగోలుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయి. సర్వ శిక్ష అభియాన్ ద్వారా కోటపల్లి జడ్పీ పాఠశాలకు ఉచితంగా ఆధార్ అప్డేట్ చేయడానికి ప్రభుత్వం ఆధార్ కిట్లను పంపిణీ చేసింది. అయితే దానిని అనువుగా చేసుకొని కోటపల్లి ఆధార్ నిర్వకుడు ప్రధానోపాధ్యాయుడు కిట్లను ప్రైవేట్ దందాకు తెర లేపుతు సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. నియమ నిబంధనల ప్రకారం పాటించాలని తెలిసినప్పటికి ఆధార్ నిర్వహకుడు అప్డేట్ కోసం ఒక్కరికి దగ్గర నుంచి 50 తీసుకోవాలి. కానీ కోటపల్లి ఆధార్ నిర్వహకుడు 150 నుంచి 300 లేదా 500లు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆధార్ సెంటర్లను తోడు చేసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆధార్ సెంటర్‌కు ఒక గదిని కేటాయించి సహకరిస్తున్నారు. దీనికి ప్రతిఫలంగా వాటా తీసుకుంటున్నారు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం పై పర్యవేక్షించాల్సిన అధికారులు మామూలా మత్తులో మునుగుతున్నారు. పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు వారికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గత నెల రోజుల కిందట ఇదే ఆధార్ నిర్వహకుడు అక్రమ వసూళ్లకు తెర లేపాడు. సిర్స పాఠశాల ఆధార్ అప్డేట్ చేస్తానని పాఠశాలలో ఏర్పాటు చేసి వసూళ్లకు పాల్పడడంతో అక్కడి నుంచి గ్రామస్థులు వెళ్ళగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి.



## మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆకాష్

**కుభీర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఆకాష్ సూచించారు. గురువారం అయన మండల కేంద్రం కుబీర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ పథక ప్రధాన ఉద్దేశం మహిళల ఆరోగ్యంలో భాగంగా రక్తహీనత తల్లి శిశు సంరక్షణ, మంచి పోషకాహారం, పరిశుభ్రత జీవన శైలిపై ప్రత్యేక అవగాహన, మానసిక ఆరోగ్యానికి కౌన్సిలింగ్ తో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు. అనంతరం సంబంధిం చిన రికార్డులను, హాస్పిటల్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ హర్షి, వైద్యులు విజయ్, వసుంధర, ఫార్మసిస్ట్ సల్ల ఆనంద్, రాధిక, ఏఎన్ఎమ్ లు, హెల్త్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.





## క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికొల్లాసాన్ని కలిగిస్తాయని జన్నారం ఎంఈఓ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలో ఎస్ఎఫ్జి అండర్-17 బాలుర వాలీబాల్ ఎంపిక పోటీలను స్లేట్ ఎక్సలెంట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ కుమార్ మాట్లాడుతూ.. వ్యాయామం మనిషి జీవితంలో ఎంతో ముఖ్యమైనది. ప్రతిరోజూ వ్యాయామం చేస్తే శరీరంలోని ప్రతి అవయవం చురుకుగా పనిచేస్తుంది. క్రీడల ద్వారా మనం ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. స్లేట్ గ్రూప్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. "జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు జన్నారం మండలంలో జరుగుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. క్రీడల్లో గెలుపోటములు సహజం. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మంచి ఫలితాలు సాధించాలి" అని శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ లక్ష్మీనారాయణ, జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష, స్లేట్ గ్రూప్ చైర్మన్ ఎ. శ్రీకాంత్ రెడ్డి, స్లేట్ గ్రూప్ ఫౌండర్ ఏనుగు సుభాష్ రెడ్డి, స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రిన్సిపాల్లు శ్యామ్లాల్, సిరిన్ ఖాన్, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ యాకూబ్, అబ్జర్వర్ పనిరాజ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు బెల్లం శీను, గాజుల శీను, సిరంగి గోపాల్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రోజి వర కుమారి, సాగర్, అలాగే పీడీలు సంతోష్, నగేష్, జోష్న, శంకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు 5లక్షల ఇందిరమ్మ ఇండ్లను అందిస్తోందని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు మడవి లచ్చు పటేల్ పేర్కొన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్ గావ్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలలను సాకారం చేయడంలో ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారన్నారు. నియోజకవర్గంలోనిఆదివాసి తెగల్లోని పీవీటీజీలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దని పేర్కొన్నారు.పేదల కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ బాధు పటేల్, కోవ ఇస్రు, పెందుర్ లింభారావు, మడవి శేష నారాయణ, మహాజన్ అర్క సేడ్మ రావు, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

**తాండూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

అంగన్‌వాడీ టీచర్లు తమ విధినిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిష్టంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన పోషన్ బీ-పడాయి బీపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి సీడీపీవో స్వరూపారాణితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. చిన్నారులకు సరైన పోషణతో పాటు సరైన విద్యాబోధన చేస్తే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. తక్కువ ఖర్చుతో ఆటవస్తులను తయారు చేసి వాటి ద్వారా విద్యా బోధన చేస్తే పిల్లలు త్వరగా నేర్చుకోగలుగుతారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఎప్పటికప్పుడు పిల్లల మానసిక శారీరక ఎదుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఫైనాన్ లిటరసీ లిప్సిక అంగన్‌వాడీలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. భేటీ బచావో- భేటీ పడావో పథకం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్ లైన్ 1980, సఖి సర్వీసెస్, హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్, నేషనల్ ఎమర్జెన్సీ నెంబర్ 112, సుకన్య సమృదియోజనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, స్వరూప, పుష్ప పాల్గొన్నారు.



# సింగరేణి గ్లోబల్ విస్తరణకు ఎస్‌బీఐ సహకారం

- ముంబయిలో ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టితో సింగరేణి సీఎండీ భేటీ
- విస్తరణ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని వినతి
- సింగరేణి అభివృద్ధి ప్రాజెక్టుల్లో పాలుపంచుకుంటామన్న ఛైర్మన్



మంచిర్యాల, (ప్రభాత సమాచారం) సింగరేణి గ్లోబల్ పేరుతో దేశ విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. ప్రస్తుతం బొగ్గు గనులకే పరిమితమైన సింగరేణి ఇతర ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ మేరకు సింగరేణి సీఎండీ బలరామ్ గురువారం ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ ఎండీ సత్యేంద్ర కుమార్ సింగ్, సీజీఎం శైలేష్ ఉన్నితన్ లతో సమావేశమయ్యారు. సింగరేణి నిర్వహిస్తున్న.. భవిష్యత్తులో నిర్వహించతలపెట్టిన ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ త్వరలోనే దేశ విదేశాల్లో కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించబోతోందని ఎస్ బీ ఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే సంస్థకు కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ లభించిందని చెప్పారు. దేశ విదేశాల్లో కీలక ఖనిజ అన్వేషణ ఉత్పత్తి కోసం ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అధ్యయనం జరుపుతోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి సంబంధించి అందిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ దేశంలో కూడా పెద్ద ఎత్తున కీలక ఖనిజ ఉత్పత్తికి పూనుకోవాలని నిర్ణయించిందని వారి దృష్టికి తీసుకువెళ్లారు. పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, 5 వేల మెగావాట్ల సోలార్, థర్మల్ ప్లాంట్లు, గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ త్వరలో చేపట్టనున్న భారీ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి ఆర్థిక సహకారం అందించాలని సీఎండీ కోరారు. దీనిపై ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి సానుకూలంగా స్పందించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఇప్పటికే సింగరేణికి ప్రధాన ఆర్థిక లావాదేవీల (లీడ్) బ్యాంకు సేవలు అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సింగరేణి అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా తన సత్తా చాటాలని ఆకాంక్షించారు. దశాబ్దాల కాలంగా ఎస్బీఐ సంస్థ సింగరేణి తో మంచి అనుబంధం కలిగి ఉందన్నారు. కాగా సింగరేణి సంస్థ దశాబ్దాల కాలంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోనే తన ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నది. సంస్థలో ఉన్న 75 శాతం కార్మికుల ఖాతాలు ఎస్బీఐలోనే ఉన్నాయి. సింగరేణి ఉద్యోగుల కోసం ఎస్బీఐ సంస్థ ద్వారా రూ. కోటి ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేసింది.

# సింగరేణి ఈపీ ఆపరేటర్లకు ఉద్యోగోన్నతులు

- ఉత్తర్వులు జారీ
- ఖాళీలతో సంబంధం లేకుండా ఏకకాలంలో ప్రమోషన్లు



మంచిర్యాల, (ప్రభాత సమాచారం) ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న అర్హత ఉన్న ఈపీ ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీడి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీసి కి , ఎక్స్ కవేషన్ కేటగిరీసి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీబి కి త్వరలో పదోన్నతులు లభించనున్నాయి. సింగరేణి వ్యాప్తంగా సుమారు 150 మంది ఆపరేటర్లకు ఈ లబ్ధి చేకూరనుంది. ఎక్స్ కవేషన్ కేటగిరీడి లో రెండేళ్లు పూర్తి చేసిన ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీసి ప్రమోషన్ ఇవ్వడానికి, ఎక్స్ కవేషన్ కేటగిరీసి లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఆపరేటర్లకు ఎక్స్ కవేషన్ కేటగిరీబి కి పదోన్నతులు కల్పించేందుకు ఆ యాజమాన్యం అంగీకరించింది. ఖాళీలతో సంబంధం లేకుండా ఈ ప్రమోషన్లు ఈ ఒక్కసారి మాత్రమే కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ సీఎండీ బలరామ్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల జరిగిన 38వ సీఎండీ, 50వ డైరెక్టర్ (పా) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం ఇచ్చిన ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఈపీ ఆపరేటర్లు ఎక్స్ కవేషన్ కేటగిరీడి లో రెండేళ్లు పనిచేసిన తర్వాత ప్రాక్టికల్ పరీక్ష, అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధించిన వారికే ఎక్స్ కవేషన్ కేటగిరీ -డి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీసి కి ఖాళీలను బట్టి పదోన్నతులు వరించేవి. ఎక్స్ కవేషన్ కేటగిరీసి లో మూడేళ్లు పనిచేసి ప్రాక్టికల్ పరీక్ష, అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధించిన వారికే ఎక్స్ కవేషన్ కేటగిరీసి నుంచి ఎక్స్ కవేషన్ కేటగిరీబి కు ఖాళీలు ఏర్పడినప్పుడు పదోన్నతులను కల్పించేవారు. ఈ అంశంపై యాజమాన్యం స్పందించి ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు ఈ అంశంపై చర్చించి ఒక నివేదికను సమర్పించారు. ఈ నివేదిక పరిశీలించిన అనంతరం సీఎండీ బలరామ్ ఈ ఒక్క సారికి ఖాళీలతో సంబంధం లేకుండా కంపెనీ నియమ నిబంధనలను అనుసరించి ప్రమోషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం మార్చి 2025 లేదా సెప్టెంబర్ 2025 నాటికి ఈపీ ఆపరేటర్ ఎక్స్ కవేషన్ కేటగిరీడిలో రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఈపీ ఆపరేటర్లు అందరికీ ఈపీ ఆపరేటర్ ఎక్స్ కవేషన్ కేటగిరీసి ప్రమోషన్ ఇవ్వనున్నారు. ఈపీ ఆపరేటర్ ఎక్స్ కవేషన్ కేటగిరీసి లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఈపీ ఆపరేటర్లందరికీ ఈపీ ఆపరేటర్ ఎక్స్ కవేషన్ కేటగిరీబి గా పదోన్నతి కల్పించనున్నారు. వీరు ప్రాక్టికల్ పరీక్ష, అసెస్మెంట్ నివేదికలో అర్హత సాధించవలసి ఉంటుంది. ఈ నిర్ణయంతో సింగరేణి మొత్తం మీద సుమారు 150 మంది ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు లభించనున్నాయి.

## యూరియా కొరతపై
# రైతుల ఆగ్రహం

మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం) యూరియా కోసం రైతాంగం ఆగమవుతున్నది. పంట ఎదిగే సమయంలో ఎరువులు దొరకక అవస్థలు పడుతున్నది. సర్కారు నిర్లక్ష్యంపై విసిగిపోయి ఆందోళనలు చేపడుతున్నది. గురువారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద 444 బస్తాలు మాత్రమే పంపిణీ చేయగా, దొరకని రైతులు రోడ్డుపై బైఠాయించారు. సీఐ బన్సీలాల్, ఏవో మార్క్ గాడ్కన్, ఏఈవోలు రైతులకు నచ్చజెప్పి టోకెన్లు అందజేశారు. ఇక మల్లంపేట రైతువేదికలో 888 బ్యాగ్‌లు పంపిణీ చేయగా, బస్తాలు రాని కర్షకులు ఆందోళనకు దిగారు. సిర్సా రైతు వేదిక వద్ద రైతులు చెప్పుల వరుస పెట్టి టోకెన్లు పొందారు. కోటపల్లి ఎస్ఐ రాజేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వెలమపల్లి రైతువేదికలో 444 బ్యాగ్‌లు పంపిణీ చేయగా, రైతులు బారులు తీరారు. భీమిని మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయానికి 260 యూరియా బస్తాలు రాగా, ఉదయం ఆరింటి నుంచే రైతులు క్యూ కట్టారు. తోపులాట జరగగా, ఏడీఏ సురేఖ రైతులతో వాగ్వాదానికి దిగారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆమె చెప్పడంతో రైతులు ఆగ్రహించి ఆందోళనకు దిగారు. తాండూర్ సీఐ దేవయ్య, భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్ చొరవ తీసుకుని రైతులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లి, శివలింగాపూర్, కొమ్మెర, అంగ్రాజ్‌పల్లి గ్రామాల రైతులకు ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో యామిని, ఏఈవో సాగర్, రాజశేఖర్, అర్చన యూరియా పంపిణీ చేశారు. ఎస్ఐ సుబ్బారావు, శ్యాం పటేల్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. 600 మంది రైతులు క్యూ కట్టగా, 222 మందికి మాత్రమే యూరియా ఇవ్వడంపై రైతులు ఆందోళన చేపట్టారు. పోలీసులు నచ్చజెప్పారు. ఎర్రగుంటపల్లి, కొమ్మెర గ్రామాలకు చెందిన రైతులకు కొమ్మెరలో టోకెన్లు ఇచ్చి.. ఆస్నాద్‌లోని రైతు వేదిక వద్ద పంపిణీ చేయగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు కిలో మీటర్ల దూరంలోనున్న ఆస్నాద్‌కు వచ్చి యూరియా తీసుకోవాలా.. అంటూ వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు. ఇక గుడిపేట రైతువేదిక వద్ద ఉదయం నుంచి రైతులు బారులు తీరారు. మధ్యాహ్నం యూరియా లోడ్ రాగా, టోకెన్లు తీసుకున్న రైతులకే మాత్రమే పంపిణీ చేయడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగారు. ఎస్ఐ స్వరూప్ రాజ్ బందోబస్తు నిర్వహించారు. కాసిపేట మండలం ముత్యంపల్లి, మల్కేపల్లిలో ఒక్కొక్కరికీ ఒకే యూరియా బస్తా ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌటాల మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో రైతులు భారీ ర్యాలీ తీశారు. వారు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు గోస పట్టించుకోకుండా.. రైళ్లు, ప్రాజెక్టులు.. అంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా యూరియా పంపిణీ చేయాలంటూ ఎంఆర్ఐ దిలీప్‌కు వినతి పత్రం అందించారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుంచి శివాజీచౌక్ వరకు నాయకులు, రైతులు రాస్తా రోకో నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గూడెం రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే హరీశ్‌బాబు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# గుంతల రోడ్డుతో నరకయాతన



ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం) జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి.. ఓ వైపు రోడ్డు కోతకు గురవడంతో ఇరుకుగా మారి అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాగులు, వంకలు ఉన్నచోట రహదారులు, వంతెనలకు మరింత నష్టం వాటిల్లింది. లోలెవల్ వంతెనలు కోసుకుపోయాయి. దారులపై ఎక్కడపడితే అక్కడ భారీ గుంతలు ఏర్పడటంతో మరింత ఆందోళనకరంగా మారింది. ఎక్కడ వాహనం బోల్తా పడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి మరమ్మతులు నెమ్మదిగా సాగుతున్నాయి. పీఆర్‌కు సంబంధించి రహదారులు, లోలెవల్ వంతెనలు, బ్రిడ్జిలు కోతకు గురైనట్లు గుర్తించారు. మొత్తం 121 చోట్ల ధ్వంసమైనట్లు నిర్ధారించారు. దాదాపు 135 కిలోమీటర్ల మేర 70 రహదారులకు నష్టమేర్పడింది. 100 లోలెవల్ వంతెనలు, 18 బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ. 6.80 కోట్లు అవసరమని నివేదించారు. శాశ్వత పనులకు రూ. 202 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించి 46 చోట్ల రహదా రులు, వంతెనలకు నష్టం వాటిల్లింది. చాలావరకు రోడ్లు కోసుకుపోవడం, భారీ గుంతలు ఏర్పడటంతో ప్రమా దకరంగా మారాయి. కనీస మరమ్మతులు కరవయ్యాయి. ఫలితంగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ. 3.15 కోట్లు అవసరమని నివేదించారు. శాశ్వతంగా పనులు చేపట్టేందుకు రూ. 62 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అధిక వర్షాలకు రహదారులు కోతకు గురవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి, ఉట్నూరు, మంచిర్యాల, ఇటు కుమురంభీం జిల్లాలకు రాపోకలకు ఇదే ప్రధాన రహ దారి.. నిధుల కొరతతో రోడ్లు భవనాల శాఖ అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రజలు నరక యాతన పడుతున్నారు.



# మత్తుతో జీవితాలు చిత్తు

- నిర్మల్ జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి సాగు, వాడకం..
- సిగరెట్ల రూపంలో విక్రయాలు
- భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్న యువత..
- బస్తీల్లో చెలరేగిపోతున్న గంజాయి ముఠాలు..
- రోడ్లపై వెళ్లే వారిపై దాడులకు పాల్పడుతున్న వైనం
- పోసులు నియంత్రించినా ఆగని గంజాయి సరఫరా
- జిల్లా ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు
- తల్లిదండ్రుల సహకారం అవసరమంటున్న వైద్యులు..

పోలీస్ శాఖకు సవాల్‌గా మారిన గంజాయి అక్రమ రవాణా, సాగు, విక్రయం





**నిర్మల్ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వాడకం అతివేగంగా విస్తరిస్తోంది. గంజాయి సరఫరా, కల్తీకల్లు, మత్తు పదార్థాలు రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తూ వ్యసన పరులకు అడ్డాగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. గంజాయికి బానిసలుగా మారి మానసికంగా కుంగిపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొంత కాలం నుంచి జిల్లా అంతటా విచ్చలవిడిగా గంజాయి విక్రయాలతో పాటు ఆ గంజాయికి బానిసలుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా యువకులు గంజాయికి బానిసలుగా మారి వ్యసనపరులుగా మారుతున్నారు. పోలీసులు గాంజా గస్తీ పేరిట విస్తృత తనిఖీలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ దీనిని నివారించడం మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నడుస్తున్న డీ అడిక్షన్ సెంటర్‌కు చికిత్స భారీగా వస్తుండడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.**

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

నిర్మల్ జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల మత్తు పదార్థాల వాడకం అతివేగంగా విస్తరిస్తోంది. గంజాయి సరఫరాతో పాటు కల్తీ కల్లు, మత్తు పదార్థాలు రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తూ వ్యసనపరులకు నిర్మల్‌ను అడ్డాగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఉడ్తా పంజాబ్ మాదిరి గానే... నిర్మల్ జిల్లాను ఉడ్తా నిర్మల్‌గా మారే ప్రమాదం కనిపిస్తున్నది. ఎస్పీ జానకి షర్మిల నిరంతరం ఎన్నిరకాల కృషిచేసినా దొడ్డిదారిన ఈ దందా పెరుగుతూనే ఉన్నది. గంజాయికు బానిసలుగా మారి మానసికంగా కుంగిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు విరిగిపోతుండడం ఆందోళన కలిగి స్తుంది. కొంత కాలం నుంచి జిల్లా అంతటా విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలతో బాటు ఆ గంజాయికి బానిసలుగా మారుతున్న వారి సంఖ్య విస్తరిస్తోంది. ముఖ్యంగా యువకులు గంజాయికి బానిసలుగా మారి వ్యసనపరులుగా మారుతు న్నారు. పోలీసులు గాంజా గస్తీ పేరిట విస్తృత తనిఖీలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ దీనిని నివారించడం మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. గంజాయికి తోడుగా కల్తీ కల్లు అమ్మకాలు కూడా విచ్చలవిడిగా సాగుతుండడంతో వీటికి బానిసలుగా మారుతున్న పిల్లల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గంజాయి, కల్తీ కల్లుకు బానిసలుగా మారిన యువకులు మానసిక రోగులుగా మారి వారి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నడుస్తున్న డీఅడిక్షన్ సెంటర్ కు గత ఏడాది కాలం నుండి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు పెద్ద సంఖ్యలో కౌన్సిలింగ్‌తో పాటు వైద్య చికిత్సల కోసం వస్తుండడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**పెరుగుతున్న మత్తు బాధితులు....**

జిల్లా కేంద్రంలోని డీ అడిక్షన్ సెంటర్ కు ప్రతినెల దాదాపు వందకు పైగా కల్తీ కల్లు, గంజాయికి బానిసలైన వారు కౌన్సిలింగ్‌తో పాటు చికిత్సల కోసం వస్తున్నారు. అలాగే గత ఏడాది కాలం నుండి ఇప్పటివరకు దాదాపు 160 మందికి పైగా ఇన్ పేషెంట్లుగా ఇక్కడ చికిత్సలు పొందడం చూస్తే నిర్మల్ జిల్లాలో మత్తు ప్రభావం ఆందోళన కలిగిస్తున్నది.

**అందుబాటులో సౌకర్యాలు...**

కాగా స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌లో ఇన్‌పేషెంట్ల కోసం ప్రత్యేకంగా 6 బెడ్లను సమకూర్చారు. అలాగే వారికి అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచారు. దీనికి తోడుగా ఓ కౌన్సిలర్ తో పాటు స్టాఫ్ నర్స్ కూడా డి అడిక్షన్ సెంటర్ లో వైద్య సేవలందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ ట్రైనీ కౌన్సిలర్‌ను అలాగే ట్రైనీ స్టాఫ్ నర్స్ ను నియమించాలన్న డిమాండ్ వస్తోంది. ఇక్కడ ట్రైనీ స్టాఫ్ నర్స్, ట్రైనీ కౌన్సిలర్ లేకపోవడంతో ప్రస్తుతం డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సిబ్బంది కొంతమేర ఇబ్బందులకు గురవుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా గంజాయి, కల్లుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం అలాగే వారు ఆ వ్యసనాలకు దూరమయ్యేట్లు వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో ఇక్కడి వైద్యాధికారికే కాకుండా సిబ్బందికి సైతం కత్తి మీద సాములామారు తోందంటున్నారు సిబ్బంది.

## సద్వినియోగం చేసుకోవాలి....

జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన అడిక్షన్ సెంటర్ ను మత్తు బాధితులంతా సద్వినియోగం చేసుకోవాలి. గత కొద్ది రోజుల నుండి అడిక్షన్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గంజాయి, కల్తీకల్లుకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. యువకులు ఎక్కువగా బానిసలు అవుతున్నాడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌లో కౌన్సిలింగ్‌తో పాటు వైద్య చికిత్సలు అందిస్తున్నాం. వ్యసనాలకు బానిసలైన వారిని వారి మిత్రులు లేదా తల్లిదండ్రులు గుర్తించి డి అడిక్షన్ సెంటర్‌కు తీసుకురావాలి. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా సమాచారం అందించవచ్చు. గంజాయికి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిని తల్లి దండ్రులు, మిత్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, వారిలో ప్రవర్తన ఎక్కువ కాకముందే జిల్లా కేంద్రంలోని డిఅడిక్షన్ సెంటర్‌ను సంప్రదించాలి.

**-అరుణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకియాట్రీ**

# వాగు దాటలేక.. రాత్రంతా బడిలోనే

**■ 'గిరి'పాఠశాలల ఉపాధ్యాయుల గోస వర్ణనాతీతం ■ చివరకు గ్రామస్తుల సాయంతో వాగు దాటిన టీచర్లు**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఆగ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు రోజులాగే ఉదయం పాఠశాలకు వెళ్లారు. విధులు ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. వాగు వద్దకు రాగానే ఒప్పొంగి ప్రమాదకంగా వాగు ప్రవహిస్తుంది. వాగులో వరద ఉధృతి తగ్గుతుందేమోనని సుమారు రెండు గంటలపాటు వేచి వేశారు. వరద ఉధృతి తగ్గకపోవడంతో చేసేది ఏమీ లేక తిరిగి పాఠశాలకు వెళ్లి రాత్రంతా అక్కడే ఉన్నారు. ఉదయం గ్రామస్తుల సహకారంతో వాగు దాటారు. గ్రామాల్లో సెల్ సిగ్నల్ కూడా లేకపోవడంతో తమ ఇంటికి సమాచారం కూడా ఇవ్వలేకపోయారు.. ఇది జిల్లా కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామాల పరిస్థితి.. ఏ సమయంలో వాగులు పొంగుతాయో తెలియని అయోమయ దుస్థితి. ఆసిఫాబాద్ మండలంలోని వాడి గొంది చెల్కగుడ గ్రామాలు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి పది, పన్నెండు కిలో మీటర్ల దూరంలో ఉంటాయి ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు స్వాతి సుమలత,నైతం హరిప్రకాష్,కుర్సింగ జాలింశ బుధవారం ఉదయం రోజు వారు లాగే తమ విధులు నిర్వహించేందుకు పాఠశాలకు వెళ్లారు విధులు ముగించుకొని సాయంత్రం తిరిగి వస్తుంటే వాగు ప్రవహిస్తుంది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వాగు ఉప్పొంగింది వాగు ఉధృతి తగుతుందేమోననీ సుమారు రెండు గంటల రెండు మూడు గంటలపాటు వేచి చూసారు. చెల్కగుడ పాఠశాలకు వెళ్లి రాత్రంతా అక్కడ గడిపారు. ఉదయం గ్రామస్తులంతా కలిసి వీరిని జాగ్రత్తగా వాగు దాటించారు. ఈ గ్రామాలు ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామాలైతే కాదు జిల్లా కేంద్రానికి దాదాపు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.



# ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురిపై కేసు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఇంటి భవనానికి సంబంధించి ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన సురేష్ మకాడియా 2002లో కన్నలాల్ నుంచి భవనాన్ని కొనుగోలు చేశాడు. కొనుగోలుదారుని ఆధీనంలో ఉన్నప్పటికీ వినియోగంలో లేదు. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన రంగినేని దీపక్ ఫోర్జరీ పత్రాలు సృష్టించి మున్సిపాలిటీలో పన్ను చెల్లించాడు. అనంతరం రిజిస్ట్రేషన్ అధికారులను పక్కదోవ పట్టించి తన బావ అయిన నరేందర్ దీపక్ దడిగెలవార్ పేరిట 2023లో రిజిస్ట్రేషన్ చేయించాడు. సాక్షులుగా ఆకులవార్ నగేష్, ఆదర్శ్ ఉన్నారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

భార్య కాపు రానికి రావడం లేదని ఉరే సుకుని భర్త ఆత్మహత్య చే సుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై సీహెచ్ కిరణ కుమార్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన కుజ్జూర్ పృథ్వీరాజ్ (37)కు తాళ్లపల్లి సుప్రియతో 2018లో వివాహమైంది. అప్పటి నుంచి పృథ్వీరాజ్ తరచూ మద్యం సేవించి ఇం టికి వచ్చి గొడవపడేవాడు. దీంతో సుప్రియ గత జూన్ మంచిర్యాలకు వెళ్లిపోయింది. ఇం టికి రావాలని పలుమార్లు కోరినా నిరాకరించ డంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధ వారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని తల్లి కుజ్జూర్ కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఆరు గ్యారంటీలు అమలు కాకపాయె ఉయ్యాలో..



ఇచ్చోడ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఆరు గ్యారంటీలు అమలు కాకపాయె ఉయ్యాలో.. అంటూ ముఖరా కే మహిళలు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీల ప్లకార్డులతో మహిళలు నిరసన తెలిపారు.

## ముఖరా (కే)లో బతుకమ్మ ఆడుతూ నిరసన

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. మహాలక్ష్మి పథకంలో ప్రతి మహిళకు 2500 రూపాయలు ఉయ్యాలో, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఆడపిల్లలకు స్కూటీలు ఉయ్యాలో, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. 4000 పింఛన్ ఉయ్యాలో, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో తఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం ఉయ్యాలో, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఆరు గ్యారంటీలు ఉయ్యాలో అంటూ ప్లకార్డులు పెట్టి బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్న ఇంకా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తలేరని మండిపడ్డారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి ఇంకా అమలు చేస్తలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలకు అమలు కానీ హామీలు ఇచ్చి మహిళలను మోసం చేసిందని, ప్రతీ వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని నిప్పులు చెరిగారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారంలో వచ్చి అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసుడు దేవుడెరుగు కానీ ప్రతి మహిళకు నెలకు 2500,పెండ్లి అయిన ఆడ బిడ్డకు తులం బంగారం, పింఛన్ రూ. 4,000, డిగ్రీ చేసిన ఆడపిల్లకు స్కూటీలు వెంటనే ఇవ్వాలని సర్పంచ్ గాడ్గే మీనాక్షి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థులు హాజరు శాతాన్ని పెంచాలి

సారంగాపూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరుశురాం సందర్శించారు. ఆనంతరం తరగతి గదులలోనీ విద్యార్థులతో మాట్లాడారు. ఈ సంవత్సరం నుండి ముఖ గుర్తింపు హాజరు ఉంటుందని కాబట్ట ప్రతి విద్యార్థి ప్రతిరోజు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలన్నారు. మంచిగా చదువు కుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటుచేసి సకాలంల సిలబస్ పూర్తి చేస్తూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సారంగాపూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
ఇటీవల మండలం తహశీల్దార్ గా బాధ్యతలు సంధ్యరాణిని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్చని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీ ఫోరమ్ అధ్యక్షులు పత్రిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భోల్లోజి నర్సయ్య, నాయకులు దశరథ రాజేశ్వర్ ,నాయకులు సత్యపాల్ రెడ్డి,బొమ్మేడ సత్యం, పలువురు ఉన్నారు.

## కడ్తాల్‌లో మహిళల గాజుల పండుగ



సోన్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో గురువారం మహిళలు, యువతులు ఉత్సాహంగా గాజుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. భారతీయ సంప్రదాయంలో గాజులకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని గుర్తుచేసుకుంటూ, ఒకరికొకరు గాజులు వేసుకొని, గోరింటాకు పెట్టుకున్నారు. ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపిన ఈ కార్యక్రమం స్నేహితుల మధ్య ప్రేమను వ్యక్తపరిచే అపురూప ఘట్టంగా నిలిచింది.

## రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలిస్తాం

### కమిషనర్ తన్నీరు రమేష్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)



బెల్లంపల్లి మున్సిపాలిటీ రోడ్లపై పశువులను వదిలితే వాటిని గోశాలకు తరలిస్తామని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌రమేష్ గురువారం హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో పశువులు సంచరిస్తున్నందున ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పశువులను గో శాలకు తరలిస్తామన్నారు. మూడు రోజుల్లోగా రోడ్లపై వదిలే సిన పశువులను యజమానులు తీసుకెళ్లాలని సూచించారు.

# లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలి



బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
లంబాడాలను ఎస్టి జాబితా నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ శ్యాంసుందర్‌కు ఆదివాసీ ప్రజలు వినతి పత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంతవరకు లంబాడాలకు ధృవీకరణ పత్రాలు, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు అందించవద్దన్నారు. లంబాడాలకు ఎస్టీ హోదా కల్పించడం ద్వారా ఎస్టీల కోసం ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ ఉపాధ్యాయ ఉపాధి అవకాశాలలో లంబాడాలు అధిక వాటాను పొందుతున్నారని ఆవేదన చెందారు. వెంటనే ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయ్ సెంటర్ల పటేళ్లు, సర్మేడిలు మహాజన్లు దేవరీలు తదితరులు పాల్గొన్నారు.



## కలప పట్టివేత.. ఇద్దరిపై కేసు నమోదు

తలమడుగు, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
పచ్చని అడవికి హాని తలపెట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామ శివారులో గల ఎంఎస్ గార్డెన్ లో అక్రమంగా టేకు కలప నిలువ ఉంచుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో రూ. 84 వేల విలువగల టేకు కలపను మొహమ్మద్ మూసా, లక్ష్మణ్‌లు టేకు కట్టెలతో ఇళ్లకు ఉపయోగించే దర్వాజాలను వాటితో పాటు మరికొన్ని చెక్కినటువంటి టేకు కలుపలు ఉండడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలు ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్, ఆర్వో కవిత, అమర్ సింగ్, ఎఫ్ఎస్ఓ గులాబ్, సెక్షన్ ఆఫీసర్ అహ్మద్ ఖాన్, బిట్ అధికారులు కృష్ణా నాయక్, సజన్ లాల్, శ్యాంసుందర్, అర్జున్ నాయక్, రాధిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి



కౌటాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
ధనవంతులకు అవసరమైన రైలు సౌకర్యం కాదని, పేదలకు బస్సు సౌకర్యం కల్పించాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య అన్నారు. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం కౌటాల భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు పేదలను చిన్న చూపు చూస్తూ పెద్దల కోసం ఖరీదైన రైలు సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. రైలు సౌకర్యం కలిపిస్తే ఎవరు చెప్పడం లేదని కానీ ముందుగా మారు మూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దిలీప్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వసంత్‌రావు, మధు కర్, బ్రహ్మయ్య, బాపు, మనీష్, బాజీరావు, శైలజ, రవీం దర్‌గౌడ్, రమేశ్, శ్రీనివాస్, తిరుపతి, భీమయ్య, లాంచ్ పటేల్, సంతోష్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

## పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్లో అత్తె గంగాధర్ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 240 కిలోల పటిక బెల్లం, 60 కిలోల నల్ల బెల్లంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని, తదుపరి చర్యల నిమిత్తం లక్సెట్టిపేట ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు.



## ప్రభుత్వ పాఠశాలలో సమావేశాలు నిర్వహించాలి

నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో గురుకుల విద్యాసంస్థలు ఈ నెల 20న మూడవ శనివారం సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పోషకులు పాఠశాల అభివృద్ధిపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. దసరా సెలవులు వస్తున్న నేప థ్యంలో ఇంటి వద్ద పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయుల సూచనలు చేయాలన్నారు.

## మంచిర్యాలలో నకిలీ సిగరెట్ల కలకలం

మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల పట్టణంలో గురువారం నకిలీ సిగరెట్ల వ్యాపారంపై ఇంటర్నేషనల్ కార్పొరేట్ విజిలెన్స్, పట్టణ పోలీసులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. కృష్ణ జనరల్ స్టోర్, పవన్ కిరాణం అండ్ జనరల్ స్టోర్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేసి, నకిలీ గోల్డ్ ఫ్లాగ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇంటర్నేషనల్ కార్పొరేట్ విజిలెన్స్ అధికారులు నాగేశ్వరరావు, రమాకాంత్, పట్టణ ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు. ఈ ఘటనతో నకిలీ వ్యాపారుల్లో అలజడి రేగింది.



## క్రీడల్లో గెలుపోటములు సహజం

### ఎంపీ గోడం నగేష్

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. కాగజ్‌నగర్‌లో పాల్వాయి పురుషోత్తంరావు కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమలో గురువారం ఆయన మాట్లాడారు. క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడాకారులు ప్రతిభ జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అలాగే క్రీడా అభివృద్ధి కోసం భవిష్యత్తు కార్యచరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా స్కీం ద్వారా క్రీడలను అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు స్మారక కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ క్రీడల్లో ఓటమి చెందిన వారు నిరాశ పడకుండా గెలుపుకు కృషి చేయాలన్నారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న
# తహసీల్దార్ సతీష్ కుమార్

**మందమర్రి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
డబుల్ బెడ్ రూమ్ ఇంటి మంజూరు కొరకు దరఖాస్తు చేసుకునేందుకు మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగురాలి వద్దకి మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్, ఆర్ఐ గణపతి రాథోడ్ లు స్వయంగా వచ్చి, ఆమె నుండి దరఖాస్తు తీసుకొని మానవత్వం చాటారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన మహిళకు ఇల్లు మంజూరుకు కృషి చేస్తానని, వికలాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆమెకు భరోసా కల్పించారు. వికలాంగురాలు ఆవేదనను అర్థం చేసుకొని, స్పందించిన తహశీల్దార్ పి సతీష్ కుమార్, ఆర్ఐ గణపతి రాథోడ్ లను పలువురు అభినందించారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయులకు
# గురు బ్రహ్మ అవార్డులు



**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు గురు బ్రహ్మ అవార్డులు అందజేశారు. గురువారం రాత్రి మంచిర్యాల గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, అన్ని మండలాల ఎంఈఓలకు నిర్వహించిన గురు బ్రహ్మ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ ఎగ్గడి భాస్కర్, డిస్టిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు హాజరై అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్ధన్ రావు, సురభి శరత్ కుమార్, యార్లగడ్డ బాలాజీ, రాం వేణు, అఖిలేందర్ సింగ్, బద్దం పురుషోత్తం రెడ్డి, డేనియల్ రాజ్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు గోనె భాగ్యలక్ష్మి, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు కొమ్ము దుర్గాప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26 నుండి రాష్ట్రస్థాయి ఓపెన్
# ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర సీనియర్, జూనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 26 నుండి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో జరుగుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బాలరాజు ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్న తెలిపారు. ఖైరతాబాద్ లోని ఆనందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పోర్ట్స్ అకాడమీ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళలు, వెటరన్ పురుషులు, మహిళలకు సింగిల్స్ పోటీలు, జూనియర్ (అండర్-18), యూత్ (అండర్-21) బాలురు, బాలికలకు సింగిల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనాలనుకునేవారు ఈనెల 23వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపించాలన్నారు. వివరాలకు 9440010404 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

## కలెక్టరేట్ ఎదుట నిరసనలో బాల్క సుమన్

**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. చెన్నూరు ని యోజక వర్గంలో ప్రజా సమస్యలపై స్వీకరించిన దా దాపు 40వేల ఫిర్యాదులను నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎ దుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయ ఏవో రాజేశ్వర్ కు గురువారం అందించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో 16 రోజుల పాటు పార్టీ శ్రేణులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నె రవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేద న్నా రు. ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో పరిస్థితి అధ్వానంగా మారిందని, తద్వార ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైయింద న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షంగా తాము ప్రశ్నిస్తున్నామని, ఇచ్చిన ఆరు గ్యా రెంటీలు, హామీలు, చెప్పిన నాలుగు డిక్లరేషన్లు పూర్తి స్థాయిలో అమలు చేయాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వర కు తాము ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజక వర్గంకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి
# నలుగురు అరెస్ట్



**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సూర్య నగర్ లో వ్యభిచార గృహంపై గురువారం నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ సీఐ తన సిబ్బందితో కలిసి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల పట్టణంలోని సూర్య నగర్ లో వ్యభిచారం నడుస్తుందని ఏసీపీ ప్రకాష్ ఆదేశాల మేరకు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో కలిసి వ్యభిచార గృహంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒక మహిళ రాకేష్ సహాయంతో వ్యభిచారం నడిపిస్తుండగా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడి చేసిన సమయంలో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నట్లు వివరాలు వెల్లడించారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ వెంట పట్టణ ఎస్ఐ తిరుపతి, సిబ్బంది ఉన్నట్లు తెలిపారు.

## సంచార కులాల డిమాండ్లను
# పరిష్కరించాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంచార కులాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురు వారం మంచిర్యాల ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సంచార జాతుల డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికిని ఈ రెండు ప్రభుత్వాలు ఏ ఒక్క డిమాండ్లను పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు త్వరగతిన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, చెలిమెల అంజన్న, శాఖపూరి భీమ్సేన్, అశోక్ వేముల, కీర్తి బిక్షపతి, నేన్నెల నరసయ్య, అంకం సతీష్, చంద్రగిరి చంద్రమౌళి, సురేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.



# యూరియా కోసం రైతులకు తప్పని ఇబ్బందులు



**కోటపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
యూరియా కోసం రైతులు ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ కేంద్రానికి 444 బస్తాలు రాగా సుమారు 1100 మంది రైతులు కేంద్రానికి చేరుకున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో బస్తా పంపిణీ చేయగా మిగితా 660 మంది రైతులు తమకు యూరియా ఏదంటూ చెన్నూరు -కోటపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. రహదారిపై బైఠాయించడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. దీంతోచెన్నూరు రూరల్ సీఐ

### యూరియా కోసం రైతుల ఆందోళన
### కోటపల్లిలోరోడ్డుపై బైఠాయించిన రైతులు
### సిర్సాలో చెప్పుల వరుస

బన్సీలాల్‌తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు రైతులను సముదాయించి ఎట్టకేలకు గొడవను విరమింపజేశారు. రైతులను రైతువేదికలోకి తీసుకువెళ్లి మళ్లీ వచ్చే యూరియా కోసం ముందస్తుగా టోకెన్లు అందించారు. అలాగే మల్లంపేట గ్రామంలో 888 యూరియా బస్తాలు రాగా పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. సిర్సా గ్రామంలో 666 బస్తాలు రాగా సుమారు 1200 మంది రైతులు యూరియా పంపిణీ కేంద్రానికి వచ్చి గంటల కొద్ది నిరీక్షించారు. ఓ వైపు ఎండ ఉండడంతో ఏదులబంధం గ్రామానికి చెందిన దుర్గం లచ్చక్క అనే మహిళ స్పృహ తప్పి పడిపోగా ఆమెను ఆసుపత్రికి తరలించారు. దీంతో రైతులు చెట్ల కిందకు చేరుకుని చెప్పుల వరుస పెట్టారు. ఇక్కడ సరిపడ యూరియా అందకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. కాగా వీరి బాధలు చూడలేక గ్రామానికి చెందిన ఏటం బాపు, రాజయ్య, యువ నాయకుడు హరీష్‌రెడ్డిలు రైతులకు మజ్జిగ పంపిణీ చేశారు. సిర్సాలో రైతు వేదిక వద్ద అన్నదాతలు నిరీక్షించారు. ఇంకెన్నాళ్లు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



## బాసర వద్ద పెరిగిన గోదావరి ఉధృతి

**ముథోల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
గోదావరి పరివక ప్రాంతమైన నాందేడ్ జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురవడంతో గోదావరిలో వరద నీటి ప్రభావం బుధవారం పెరిగింది. గోదావరిపై మహారాష్ట్రలో నిర్మించిన విష్ణుపురి గైక్వాడ్ ప్రాజెక్టు నుంచి క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద బాసర ద్వారా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. బాసర వద్ద కొత్త బ్రిడ్జిని ఆనుకొని రెండు ఒడ్డులను కలుపుకొని గోదావరి ప్రవహించడంతో బాసర మండలంలోని సాలాపూర్ కౌటా ఓని బాసర పంచగూడ తదితర ప్రాం తాల్లో శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో పంట లు మునిగిపోయినట్లు రైతులు తెలిపారు.

**ముంపు నష్టం జరగకుండా చర్యలు...**
బాసర గోదావరి వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ మరోసారి పంట పొలాలను ముంపు గురి చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 20 రోజుల క్రితమే మూడు రోజుల పాటు పంట నీటిలో మునగడంతో తీవ్ర నష్టం జరగగా మళ్లీ వరద నీరు పంటలను ముంచి వేయడంతో ఈ విషయాన్ని ముథోల్ ఎమ్మెల్యేకు రైతులు మొరపెట్టుకున్నారు. ఆయన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమస్య చెప్పి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదలను పెంచాలని సూచించగా ఆయన అధికారితో మాట్లాడి నీటి విడుదలను పెంచారు ప్రస్తుతం శ్రీరాంసాగర్లోకి 2 లక్షల పై వరద నీరు వస్తుండగా మూడు లక్షల క్యూసెక్కులను 36 గేట్ల ద్వారా విడుదల చేసినందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది

## పోక్సో కేసులో ఇరవై ఏళ్ల జైలుశిక్ష

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఫోక్సో కేసులో ఒకరికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని ఓ మండలానికి చెందిన మైనర్ బాలిక తన అమ్మమ్మ ఇంటి వచ్చింది. అదే ప్రాంతంలో ఉండే మరప రామేశ్వర్ సదరు బాలిక కు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక తనకు కడుపు నొప్పి విపరీతంగా వస్తుందని తన తల్లి చెప్పింది. జరిగిన విషయాన్ని బాలిక తల్లికి చెప్ప డంతో జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో నిందితుడు రామేశ్వర్ కు ఇరవై ఏళ్ల జైలు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందించారు.

# ‘ఓజి’ రన్ టైం లాక్..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి ఇపుడు రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సెన్సేషనల్ ప్రాజెక్ట్ చిత్రమే "ఓజి". భారీ హైప్ ని సొంతం చేసుకున్న ఈ సినిమా కోసం అభిమానులు చాలా ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తున్నారు. ఇలా రీసెంట్ గానే సెన్సార్ ఫార్మాలిటీస్ కూడా ఈ సినిమా పూర్తి చేసుకున్నట్టుగా టాక్ వచ్చింది. ఇక ఈ చిత్రానికి రన్ టైం పై లేటెస్ట్ న్యూస వినిపిస్తుంది.దీని ప్రకారం సినిమా మొత్తం 156 నిమిషాల నిడివితో రాబోతున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. అంటే రెండు గంటల 36 నిమిషాల పాటు ఓజి మ్యాడ్నెస్ ఉండబోతుంది అని చెప్పాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటించింది. అలాగే డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించిన ఈ సినిమా ఇంకొన్ని రోజుల్లో థియేటర్స్ లో విడుదల కాబోతుంది.



## గ్లామర్ డోస్ పెంచిన చిట్టి..

సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టీవ్ ఉంటుంది యంగ్ బ్యూటీ ఫరియా. నెట్టింట తరచూ లేటెస్ట్ ఫొటో షూట్లు షేర్ చేస్తూ అభిమానులను ఫిదా చేస్తుంటుంది. తాజాగా గ్రీన్ కలర్ మినీ స్కర్ట్ లో క్లీవేజ్ షో చేస్తూ ఒక్కసారిగా సోషల్ మీడియాను హీటెక్కించింది ఈ ముద్దుగుమ్మ. ఫొటోలకు హాట్ ఫోజులిస్తూ కుర్రకారు గుండెదడ పెంచేసింది.ఈ ఫొటోలు నెట్టింట వైరల్ కావడంతో.. ఇవి చూసిన నెటిజన్లు వావ్, స్టన్నింగ్, హాట్ అంటూ ఫైర్ ఇమేజీలతో లైకుల వర్షం కురిపిస్తున్నారు.'జాతి రత్నాలు' మూవీలో చిట్టీ పాత్రతో యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ తెచ్చుకుంది ఈ ఆరడుగుల సుందరి. దీని తర్వాత ఫరియాకు పెద్దగా సక్సెస్ లేకపోయినా ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. సినిమాలు లేకపోతే టీవీ షోలు లేదంటే స్పెషల్ సాంగ్స్ ఇలా ఏదో ఒక విధంగా అభిమానులను అలరిస్తోంది ఈ బ్యూటీ.నాగార్జున, మెగాస్టార్, ప్రభాస్ వంటి స్టార్ హీరోల సరసన స్పెషల్ సాంగ్స్ లో మెరిసింది ఫరియా.తెలుగులో ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు, మత్తు వదలరా, ఆ ఒక్కటి అడక్కు సినిమాలు చేసింది. ప్రస్తుతం అల్లరి నరేష్ సినిమాలో నటిస్తోంది.



## ‘మార్కో’ సీక్వెల్ కి క్రేజీ టైటిల్!

ఈ మధ్య కాలంలో ఇండియన్ సినిమా దగ్గర క్రేజీ వైలెంట్ సినిమాగా సెన్సేషన్ సెట్ చేసిన చిత్రమే "మార్కో". మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోగా దర్శకుడు హనీఫ్ అదేని తెరకెక్కించిన ఈ సినిమాకి తెలుగు, హిందీ లలో కూడా మంచి వసూళ్లు వచ్చాయి.అయితే వీటితో పాటుగా ఈ సినిమాలో విజువల్స్ అందులోని వైలెంట్ కంటెంట్ దెబ్బకి పలు కాంట్రవర్సీలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక దీని సీక్వెల్ కూడా ఆగే పరిస్థితికి వచ్చింది. కానీ మార్కో కి ఫైనల్ గా సీక్వెల్ ఇపుడు ఖరారు అయినట్టు తెలుస్తోంది.మరి దీనికి మేకర్స్ "లార్డ్ మార్కో" అనే టైటిల్ ని ఫిక్స్ చేశారట. అలాగే ఈ సినిమాలో ఉన్ని కనిపించకపోవచ్చు అనే కూడా వినిపిస్తోంది. మరి దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఇదిలా ఉంటే ఉన్ని ముకుందన్ పై నిన్ననే ప్రధాని నరేంద్ర మోడీపై భారీ బయోపిక్ అనౌన్స్ అయ్యిన సంగతి తెలిసిందే.



## మెంటల్ టెన్షన్ వద్దు గురూ..

అనారోగ్యానికి మించిన సమస్య మరోకటి ఉండదని నటి సమంత అన్నారు. ఎలాంటి విషయాలనైనా అభిమానులతో పంచుకునే ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వ్యక్తిగత అంశాల గురించి మాట్లాడారు. తన జీవితంలో ఎన్నో దాటుకొని ఈ స్థాయికి వచ్చినట్లు చెప్పారు."ఆరోగ్య సమస్య రానంత వరకూ మనం చిన్న చిన్న వాటిని కూడా ఇబ్బందులుగా భావిస్తాం. వంద సమస్యలున్నట్లు అనిపిస్తుంటుంది. కానీ, ఒక్కసారి అనారోగ్యానికి గురైతే దాని ముందే ఏదీ పెద్దదిగా అనిపించదు. అప్పుడు దృష్టంతా ఆరోగ్యంపైనే పెడతాం. ప్రస్తుతం నేను నిద్ర, ఆహారం, మానసిక ప్రశాంతతపైనే ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నా. గతంతో పోలిస్తే వీటి విషయంలో కఠినంగా ఉంటున్నా. అందుకే నేను ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నాను" అని సమంత చెప్పారు. ఇటీవల కూడా ఇదే విషయంపై మాట్లాడారు. కెరీర్ పరంగాను మార్పులు చేసుకున్నట్లు వెల్లడించారు. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయనన్నారు. ప్రస్తుతం సమంత ‘రక్త బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్’ లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, సమంతతో పాటు అలీ ఫజల్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.

# భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి





## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఈనెల 22నుంచి ప్రారంభమవుతున్న శరన్నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుర్గాదేవి, శారద మాత మండపాల నిర్మాణంలో నాణ్యమైన వస్తువులు, వైర్లను వినియోగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సెక్టార్లు, క్లస్టర్లుగా విభజించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీలు జీవన్ రెడ్డి, శ్రీని వాస్, వన్డేన్, టూటౌన్, ట్రాఫిక్, జైనథ్, ఆదిలాబాద్‌రీరల్ సీఐలు సునీల్ కుమార్, నాగరాజు, ప్రణయ్ కుమార్, సాయినాథ్, ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన భవనం మంజూరు చేయాలి

**వాంకిడి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
వాంకిడి సాంఘిక సంక్షేమ శాఖల బాలుర వసతి గృహానికీ నూతన భవనం మంజూరు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సజీవన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందని దీంతో విద్యార్థులను బీసీ వసతి గృహానికి తరలించడం జరిగిందన్నారు. బీసీ వసతి గృహం పెచ్చులు ఉడి విద్యార్థులపై పడుతున్నాయని దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలి



**చింతలమానేపల్లి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీల రైతులు కలిసి తక్షణమే యూరియా పంపిణీ చేయాలని, రైతుల కష్టాలను తొలగించాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గూడెం రోడ్డు పనులు వెంటనే మరమ్మతులు చేయాలి డిమాండ్ చేశారు. రెండు నెలలు గడుస్తున్నప్పటికి చింతలమనెపల్లి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడెం గ్రామానికి ఆర్టీసీ బస్సు నడవక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి వందే భారత్ రైలు వస్తుంది కని గూడెం గ్రామానికి ఆర్టీసీ బస్సు రాదా అని ప్రశ్నించారు. సమస్యను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని రైతులు, నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుబ్బులు వెంకన్న, నజిమ్ హుస్సేన్ ,డోకె రాజన్న, నిలగౌడ్, డొకె శ్రీను, అంజన్న, రైతులు, కోనేరు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



### సమాజానికి స్ఫూర్తినిచ్చేలా

## ప్రధాని జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం నుండి మొదలుకొని మహాత్మ గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ వరకు బీజేపీ పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్‌లో గురువారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి బతుకమ్మ ఘాట్ వద్ద చెత్త తొలగించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రపంచమంతా సమర్థిస్తుందని అన్నారు. దేశ ప్రజలందరూ కోరుకున్న విధంగా ప్రపంచానికే భారతదేశ నాయకత్వం వహించాలనే విధంగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఆ దిశగా దేశం పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్, నాయకులు గందె విజయ్ కుమార్ జోగు రవి, రాజేష్, దినేష్ మాటోలియా, ప్రవీణ్ పాల్గొన్నారు.

## చివరి మజిలీకి తప్పని తిప్పలు

### మంచంలో మృతదేహంతో వాగు దాటిన వైనం



**ఉట్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు దాటినా నేటికీ ఆదిలాబాద్ జిల్లాలోని ఎన్నో గ్రామాల్లో ప్రజలు చివరి మజిలీకి సైతం చిక్కులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఉట్నూర్ మండలంలో జరిగిన ఓ ఘటనే నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ వాసి కుమ్ర పారుబాయి (45) అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులు ఏర్పాట్లు చేశారు. కానీ శ్మశానవాటిక గ్రామంలోని వాగుకు అవతలి వైపు ఉన్నది. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆ ఊరిలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో మృతదేహాన్ని మంచంలో ఎత్తుకొని ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని వాగు దాటి శ్మశానవాటికకు చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో

## యువకుడి దుర్మరణం

**కుభీర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**



కుభీర్ మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన మాహూర్ శీను అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుభీర్ నుండి పార్డి (కె) వెళ్లే రహదారిలో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవి పందులు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి తుమ్మ చెట్టుకు ఢీకొన్నాడు. దీంతో అయన అక్కడికక్కడే మృతి చెం దినట్లు ఎస్ఐ తెలిపారు. సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ నైలు నాయక్, కుభీర్ ఎస్ఐ కృష్ణ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి శవ పంచనామా అనంతరం మృతదే హాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మోదీ నాయకత్వంలోనే దేశభద్రత

**గుడిహత్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశ భద్రత సాధ్యమని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక శివకల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. బీజే పీ ఉన్నంత వరకు దేశానికి ఎలాంటి ఆపద రాదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, రైల్వే బోర్డు సభ్యుడు బోసారే గణేశ్, నాయకులు కేంద్రే శివాజీ, కేంద్రే లక్ష్మణ్, భరత్, వామన్తే, కేంద్రే కుమార్, రాజేంద్రప్రసాద్, బోడ్కే జగన్, స్థానిక బ్లడ్ మ్యాన్ లోఖండ్ అనిల్, రిమ్స్ వైద్య సిబ్బంది ఉన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి నిధుల మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. హైదరాబాద్‌లో సీఎంను కలిసిన ఎమ్మెల్యే వినతి పత్రం ఇచ్చారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ నిర్మాణం తదితర వాటిపై సీఎం విన్నవించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నియోజకవర్గంలో అనేక రహదారులు దెబ్బతిన్నాయని వాటి మరమ్మతుల తో పాటు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 5,576 మంది రైతులు 8,566 ఎకరాల్లో పంటలు నష్టపోయారని, అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. విన్నవించినా అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## బాలింతకు దారి కష్టాలు

సిరికొండ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
సిరికొండ మండలంలోని మారుమూల కన్నాపూర్ పంచాయతీ పరిధి కన్నాపూర్ తండాకు చెందిన మీనా నిండు గర్భిణి. ఆమెకు ఈ నెల 16న పురిటి నొప్పుల రాగా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మీనా మగ బిడ్డకు జన్మనిచ్చింది. గురువారం వైద్యులు డిశ్చార్జి చే యగా 102వాహనంలో ఆమెను గ్రామానికి త రలిస్తుండగా మార్గమధ్యలో ఉన్న వాగు ఉధృతికి వాహనం దాటలేక పోయింది. దీంతో పైలెట్ షేక్ సాహిద్ పసిబిడ్డతో ఉన్న బాలింతను వాగు దాటించారు. అక్కడి నుంచి సుమారు కి లోమీటర్ దూరం వరకు కాలినడకన వెళ్లి వారు గ్రామానికి చేరుకున్నారు.

### ఉచిత న్యాయ సేవలు
## వినియోగించుకోవాలి



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
నిరుపేద ఖైదీలు డిఫెన్స్ కౌన్సిల్ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వి నియోగం చేసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం సూచించారు. గురువారం జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో కలిసి జిల్లా జైలును సందర్శించారు. న్యాయాన్ని పొందే విధానాన్ని ఖైదీలకు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉమేశ్రావు డోలే, జాదవ్ సంగీత, తిలోత్తమ, రూపేశ్ ఉన్నారు.

## బీఆర్ఎస్ పని అయిపోయింది

### ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, మరి కొన్ని రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పని సైతం ముగుస్తుందని, అలాంటి పార్టీల నాయకుల గురించి మాటాడడం సమయం వృథా అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎద్దేవా చేశారు. సాత్నాల మండలంలోని జామిని, జంగుగూడ గ్రామాల్లో గురు వారం ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరాగా, వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకుడు అనేవారు ప్రజలకు మాట ఇచ్చి మర్చిపోవద్దన్నారు. అలాంటి పరిస్థితులు తనకు వస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరుణాకర్ రెడ్డి, సుభాష్, రమేష్ రోహిదాస్, రాము, మీరాబాయి, రేణుకాబాయి, ఆనంద్ రావు, అశోక్ పాల్గొన్నారు.

# న్యూరో సమస్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన

### యశోదలో రోబోటిక్ సర్జరీలు

నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
హైదరాబాద్ యశోద ఆసుపత్రులలో మెదడుకు రోబోటిక్ సర్జరీ సైతం చేస్తున్నామని న్యూరో సర్జన్ డాక్టర్ బి.జె రాజేష్ అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో న్యూరో సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల నుంచి యశోద హాస్పిటల్లో క్రిటికల్ బ్రెయిన్, వెన్నుముక సంబంధించిన సర్జరీలు చేస్తున్నామన్నారు. నిర్మల్ ప్రాంతానికి చెందిన మహిళ మెదడులో ఉన్న కంతికి ఆపరేషన్ నిర్వహించామన్నారు. అలాగే శ్రీనివాస్ అనే వ్యక్తికి వెన్నుముక ఆపరేషన్ నిర్వహించగా.. వీరిద్దరూ ప్రస్తుతం పూర్తిగా కోల్కొని , మామూలు స్థితికి చేరుకున్నారని పేర్కొన్నారు. యశోదలో ఎన్నో సంవత్సరాలు అనుభవం కలిగిన న్యూరో సర్జన్స్ ఉన్నారని చెప్పారు. రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి శస్త్ర చికిత్సలు సైతం నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల మెదడుకు తీవ్రమైన గాయాలు ఏర్పడిన సందర్భాల్లో రక్తస్రావాన్ని నిలిపివేయడం, మెదడు ఒత్తిడిని తగ్గించడం లాంటి ఎమర్జెన్సీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సిబ్బంది, చికిత్స పొందిన పేషెంట్లు, శ్రీనివాస్ భోజన్న ప్రతినిధులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని వరంగల్ ఆర్జేడీ, రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీ, భవిత రిసోర్స్ సెంటర్, తాటిగూడ, యాపల్గూడ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజ నం, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎస్ఆర్ఎస్, ఎఫ్ ఎల్ఎన్, డైస్, పీఎం పోషణ్, పీఎంశ్రీ పథకాలని ర్యహణ, మరుగుదొడ్లు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. సెక్టోరియల్ అధికారులు తిరుపతి, రఘురమణ ఉన్నారు. మండలంలోని యాపల్గూడా ఎంపీపీఎస్ను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మ ధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్, ఎఫ్ఎల్ఎన్ రికార్డులు, టీఎల్ఎం సామగ్రి, లైబ్రరీ, ఏఐ తరగతులు, ఆన్లైన్ రిపోర్టులు, పీటీఎం సమావేశ రికార్డులు ప రిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధికి సూచనలు చేశారు. విద్యార్థుల పఠనా సక్తి, ఉపాధ్యాయుల కృషిపై సంతృప్తి వ్యక్తంజేశారు.

# సంకల్ప్ సెమినార్లో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
హైదరాబాద్లోని ఎంసీఆర్హెచ్ఆర్డీలో గురువారం సంకల్ప్ సెమినార్ నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీ వో ఖుష్బూ గుప్తా, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఢిల్లీ ప్రతినిధులతో పాటు రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ హాజరై శిశు మరణాలను తగ్గించాలన్నారు. రాష్ట్రంలో శిశు మరణాల రేటు 13.4 ఉండగా, 10 శాతానికి తెచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి

దహెగాం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
దహెగాం మండలం చెంద్రపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పీకలగుండం గ్రామానికి చెందిన గోమాస పోషం (60) గురువారం విద్యుత్షాక్తో మృతి చెందాడు. ఉదయం పొలం పనులకు వెళ్లి పనులు చేస్తున్న సమయంలో నీళ్లు తాగడానికి మోటార్ ఆన్ చేస్తుండగా మోటారుకు ఉన్న విద్యుత్ వైర్లు తగిలి అక్కడి అక్కడే మృతి చెందాడు. పోశం ఎంతకీ రాకపోవడంతో ఆయన భార్య లచ్చుబాయి పొలం వద్దకు వెళ్లి చూడగా పోచం కరెంటు స్విచ్ బోర్డు వద్ద పడి ఉన్నాడని తెలిపింది. సమీపంలో ఉన్న రైతులు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మృతుడు కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.





## క్రీడలతో మానసికోల్లాసం

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. కొంతసేపు మైదానంలో బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. ఏడు జట్లు పోటీల్లో పాల్గొనగా మొదటి విజేతగా నిలిచిన సూపర్కింగ్స్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆదిలాబాద్ రాయల్ జట్టుకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్రావు, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్సింగ్, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్రెడ్డి, నాగేందర్, ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు సునీల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## కేసులు వేగంగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)
జిల్లాలో వన్యప్రాణుల వేటకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పో లీసు కార్యాలయంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్తో కలిసి గురువారం టాస్క్ ఫోర్స్ సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ పోలీస్, అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ టాస్క్ ఫోర్స్ సిబ్బంది వన్యప్రాణుల సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. అటవీ జంతువులను వేటాడిన కేసుల్లో నిందితులకు త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్నగర్ ఎఫ్డీవో సుశాంత్, సిబ్బంది మునవీర్, యూస్రీరాణి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ వెదురు దినోత్సవం



**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలో అంతర్జాతీయ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో మహేంద్ర బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కార్యక్రమంలో భాగంగా మహేంద్రు లందరూ మండల కేంద్రంలోని రామాలయం దగ్గర నుండి బస్టాండ్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మహేంద్ర సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు అనంతరం మహేంద్ర సంఘం భవనం వరకు ర్యాలీగా వెళ్లారు మహేంద్ర సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎస్ డి ఓ మాధవరావు తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎఫ్ఆర్ఓ శ్రీకాంతాచారి ఎఫ్ఆర్వో సుష్మ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజఫర్ అలీఖాన్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘ మండల అధ్యక్షులు ఎమ్మార్ నరసింగ రావు మాట్లాడుతూ జన్నారం మండలంలో 350 కి పైగా మహేంద్ర మేదరి కుటుంబాలు ఉన్నాయని అందులో దాదాపు 70 శాతానికి పైగా కుటుంబాలు వెదురుపై ఆధారపడి బతుకుతున్నాయని తరతరాలుగా తమ యొక్క బతుకు వెదురుతో ముడిపడి ఉందని వెదురు ఎక్కడ ఉంటే మేదరి కుటుంబాలు అక్కడ జీవనం సాగిస్తుందని తాతలు తండ్రుల నుంచి ఆనవాయితీగా వస్తున్న ప్రక్రియ అని రెక్కడితేగాని డొక్కాడని చాలా కుటుంబాలు ఉన్నాయని వెదురుతో తయారు చేసిన అల్లికల ద్వారా పూట గడుపుకునే కుటుంబాలు ఉన్నాయని అటువంటి వారు అడవికి వెళ్లి వెదురు బొంగులు తీసుకొచ్చుకునే క్రమంలో అటవీశాఖ అధికారులు కాస్త పెద్ద మనసు చేసుకొని చూసి చూడనట్టుగా వ్యవహరించాలని ఆయన కోరారు. అలాగే చాలా కుటుంబాలు సరైన ఇల్లు లేక చిన్న చిన్న రేకుల షెడ్లలో నివసిస్తున్నారని అలాంటి వారిని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఇస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డికి విన్నవించారు అనంతరం ఎఫ్డిఓ మాధవరావు మాట్లాడుతూ మహేంద్ర కులస్టులకు ఉన్నసమస్యలు తమ దృష్టికి వచ్చాయని కానీ తమ పరిధికి మించి ఏమిచేయాలెమని ప్రత్యన్మయ్య మార్గాలు చాలా ఉన్నాయని వెదురుతో కలాకృతులను తయారు చేసి విక్రాయించుకోవడం అలవార్చుకోవాలన్నారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున లబ్దిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తామని అన్నారు కార్యక్రమంలో బిజెపి మండలంధ్యక్షుడు మధుసూదానరావు మాట్లాడుతూ మహేంద్రులు చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా



యని దానికి కారణం చాలిచాలని ఆదాయం తో తయారు చేసుకొనే తమయొక్కకులవృత్తి పరికరాలు అనిఅన్నారు సమస్య పరిష్కారం కోసం పార్లమెంట్ సభ్యుడు దృష్టికి తీసుకెళ్తా అని హామి ఇచ్చారు అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ వెదురుతో తయారుచేసిన పరికరాలు మన మానవ జీవితంలో భాగమై ఉన్నాయని కులవృత్తులను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ డి ఓ మాధవరావు తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎఫ్ ఆర్ ఓ శ్రీకాంతాచారి ఎఫ్ ఆర్ వో సుష్మ తో పాటు మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు ఎమ్మార్ నరసింగరావు ప్రధాన కార్యదర్శి కోశాధికారి ప్రచార కార్యదర్శి కోడి జుట్టు రాజన్న పిల్లి మల్లయ్య ఒడిపల్లి రామన్న మహేంద్ర కుల బంధువులు పాల్గొన్నారు.



## అటవీ అధికారులపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

**ఇచ్చోడ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
కేశవపట్నం ఫారెస్ట్ అధికారులపై పోలీసు అధికారులపై దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడుగా వ్యవహరించిన షేక్ అల్తాఫ్ ను గురు వారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలియజేశారు. ఇదివరకే 7 కేసుల నందు ప్రధాన నిందితుడుగా ఉన్నటువంటి షేక్ అల్తాఫ్ ఇన్ని రోజులు పోలీసులకు చిక్కకుండా తప్పించు కుని తిరుగుతూ ఉండగాచాకచక్యంగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. 16వ తారీకు నాడు సిరి చల్మా గ్రామంలో నేతుల నారాయణ అనే వ్యక్తి షట్టర్ను దౌర్జన్యంగా తీసి వేసేందుకు ప్రయత్నించిన అందుకు బాధితుని ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా షేక్ అల్తాఫ్ అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇతనిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు ఎక్స్టాషన్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇదివరకు నమోదైన కేసులలో హైకోర్టు ద్వారా బెయిల్ బయటకు వచ్చాడన్నారు. నిందితుడుపలు కేసులలో ప్రధాన నిందితుడుగా ఉండి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నటు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## పిచ్చికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

**దస్తురాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రాంపూర్, మున్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో గురువారం ఐదుగురిపై పిచ్చికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. మున్యాలకు చెందిన హర్షవర్ధన్, రాంపూర్‌కు చెందిన హర్ష, భూత్కూర్‌కు చెందిన కాల్వ బాలయ్య, దస్తురాబాద్‌కు చెందిన నిశ్విత్, అయేషాలను గాయపర్చడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్సను అందించి మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 60 నిముషాలు 180 సూర్య నమస్కారాలు




## అంతర్జాతీయ యోగా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

**మందమర్రి, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
60 నిమిషాల వ్యవధిలో 180 సూర్య నమస్కారాలు ప్రదర్శించి అంతర్జాతీయ యోగా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు పట్టణానికి చెందిన మద్ది శంకర్. పట్టణంలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, సూర్య నమస్కారాలపై శ్రద్ధాసక్తులు ప్రదర్శించి గత కొంతకాలంగా సూర్య నమస్కారాల ప్రదర్శనతో అందరిని ఆకట్టుకుంటున్నారు. అంతర్జాతీయ యోగా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించే లక్ష్యంతో గురువారం 60 నిమిషాల వ్యవధిలో 180 ఆసనాలు ప్రదర్శించి యోగ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు ను సుస్థిరం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య నమస్కారాలు కేవలం శారీరక వ్యాయామమే కాకుండా ఆధ్యాత్మిక యాత్ర అని, ఆత్మ శుద్ధి, శక్తి ని ప్రసాదించే సాధన ఆని అన్నారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో యోగాను దినచర్యగా పాటించాలని కోరారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన మద్ది శంకర్ ను పలువురు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్ కుమార్, హిందూ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు గోవర్ధనగిరి అనంతచార్యులు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కనపర్తి రమేష్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, యోగ గురువులు ముల్కల శంకర్, రెవెల్లి రాజలింగు, ఏఈఈజే పోచం, సింగరేణి కాంట్రాక్టర్ బర్ల సదానందం, మెడికల్ అధికారి డాక్టర్ అద్వైత, కార్యక్రమం కో-ఆర్డి నేటర్లు షానవాజ్, గంప అనిల్, సింగరేణి యోగ క్లబ్ సభ్యులు, వాకర్స్ సభ్యులు, యోగ గురువులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవలకు మరో నూతన భవనం

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే అనిల్

**బోథ్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేం దుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఎమ్మె ల్యే ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రోగులను పలకరించి ఆస్పత్రిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డాక్టరలతో మాట్లాడి రోగుల ఆరోగ్య క్షేమలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల వివరాలను డాక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరికరాల కొరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో కమిషనర్‌ని కలిసి ఈసీజీ మిషనరీ మంజూరు చేయాలని కోరడం జరిగిందని, రూ.4 కోట్లతో మరో భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయనన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ వైస్ ఎంపీ పీ స్వామి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ నారా యణ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, యూత్ అధ్యక్షులు ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు ప్రశాంత్, చంద్రమోహన్, రఫీ, ఇఫ్తేకార్ ఉన్నారు.



## 'మా పాఠశాలను సందర్శించండి'

**ఉట్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను సందర్శిం చాలని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అధ్యా పకులు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్సింగ్ను గురువారం ఆహ్వానించారు. ఆరోగ్య జాతర ఛాంపి యన్లుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, బహుమతులు ప్రదానం చేయాలని ప్రధా నోపాధ్యాయురాలు శీతల్ చవాన్ తెలిపారు. ఉపాధ్యాయురాలు రవిత, శ్రీవాణి ఉన్నారు.



## పొచ్చెర జలపాతంలో రివర్ రాఫ్టింగ్



**బోథ్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పొచ్చెర జలపాతం వద్ద గురువారం రివర్ రాఫ్టింగ్ నిర్వహించారు. పొచ్చెర నుంచి కుప్టి వరకు సుమారు 6 కిలోమీటర్ల దూరాన్ని ఒకటిన్నర గంటల వ్యవధిలో ట్రయల్ రాఫ్టింగ్ చేశారు. వర్షాకాలంలో రాఫ్టింగ్ నిర్వహించేందుకు అటవీ అధికారులు చేసిన ప్రతిపాదనలపై శుక్రవారం జరగబోయే టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ జిల్లా సమావేశంలో ప్రస్తావించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎఫ్ఆర్వో ప్రణయ్, ఇంద్రవెల్లి ఎస్ఆర్వో సంతోష్, కోయినా అడ్వెంచర్ టీమ్, రివర్ రాఫ్టింగ్ సభ్యులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా కల్వర్టులు.. ప్రయాణికులకు తిప్పలు



**బురదతో నిత్యం ప్రమాదాలు**

**నార్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ, నార్నూర్ మండలాల్లో భారీ వర్షాలకు కల్వర్టులు అధ్వాన్నంగా మారాయి. ఈ కల్వర్టుల గుండా వెళ్లడానికి ప్రయాణికులు జంకుతున్నారు. గాదిగూడ మండలం ఖడ్కి కల్వర్టుపై నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాలకు నిత్యం వందల వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. లో లెవెల్ కల్వర్టు పై నీరు పారుతుండడంతో పాకు పట్టింది. ఈ కల్వర్టుపై ద్విచక్ర వాహనాలు నడిపేందుకు ఇబ్బంది పడవలసి వస్తుంది. పాకు పట్టడంతో వాహనాలు జారిపడుతున్నామని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. లో లేవల్ కల్వర్టు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన మంజూరు చేయాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు. నార్నూర్ మండలం దుప్పాపూర్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై కల్వర్టు అధ్వానంగా తయారైంది. వర్షానికి కోతకు గురై బురదమయంగా మారింది. ప్రయాణికులు. రాత్రివేళ వాహనం అదుపుతప్పితే ప్రాణాలు కోల్పోవాల్సిందేనని భయభ్రాంతులకు గురవుతున్నారు.





### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# షుగర్ నిర్ధారణ పరీక్షలు

**తాండూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంలోని మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ వద్ద తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం ఉచితంగా మధుమేహం వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మందికి మధుమేహం వ్యాధి, బీపీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మదుమేహం, బీపీ ఉన్న వారికి పలు జాగ్రత్తలు సూచించారు. ఆరోగ్య రక్షణకు ప్రతి ఒక్కరూ, ప్రతిరోజు వ్యాయామం చేయాలని తెలిపారు. వ్యాయామం, నడక, యోగా, స్విమ్మింగ్, సైక్లింగ్ చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దేవరకొండ రాజన్న, ఉపాధ్యక్షులు మద్దికుంట రాంచందర్, ఠాకూర్ ఉమ్రావ్ సింగ్, కాబినెట్ మెంబర్ రౌతు వెంకటేశం, తాటిపాముల సాంబమూర్తి, గందె రాజన్న, తొగరు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషన్ వేణు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరైన 13మంది రైతులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడిలో రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలంటూ నిరసన తెలిపిన 13 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేయడంతో వారు ఈరోజు ఆదిలాబాద్ కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబర్ 18న రుయ్యాడీలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తలమడుగు పోలీసులు 13 మంది రైతులపై కేసు నమోదు చేశారు. ఏడాది తర్వాత రైతులకు కోర్టుకు హాజరు కావాలని సమాన్లు అందజేయడంతో వారు గురువారం కోర్టుకు వచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ విషయంలో నిరసన తెలిపినందుకు ప్రభుత్వ అక్రమ కేసులు బనాయిస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేశారు.




# రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపిక



**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాస్థాయి ఎఫ్ఎల్ఎన్ టిఎల్ఎం మేళను గురువారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యాధికారి భోజన్న సందర్శించి 19 మండల స్థాయిలో ఎంపిక కాబడి జిల్లా స్థాయికి వచ్చినటువంటి 190 టిఎల్ఎంలను విషయ నిపుణులైన ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించి విజేతలను ప్రకటించారు. ఒక్కొక్క టిఎల్ఎం పాఠశాల స్థాయిలో ఏ విధంగా విద్యార్థులకు అమలు పరుస్తారో వాటి ద్వారా పిల్లల సామర్థ్యాలను ఏ విధంగా అభివృద్ధి పరుస్తారో ఉపాధ్యాయులతో చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ కృత్యాలను పాఠశాల స్థాయిలో అమలుపరిచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంలో ముందంజలో ఉండేటట్టు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, అకాడమిక్ మానిటరింగ్ అధికారి నరసయ్య, సంయుక్తంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అభ్యసన బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి విద్యార్థులలో సబ్జెక్టుకు సంబంధించిన సామర్థ్యాలను అలాగే అభ్యసన ఫలితాలు రాబట్టే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ప్రదర్శించిన కృత్యాల ద్వారా పిల్లలలో సామర్థ్యాలను సాధించడానికి సులువుగా ఉపయోగపడతాయని కావున వీటిని తరగతి బోధనలో ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ - టిఎల్ఎం మేళాలో 190 ప్రదర్శనలు ప్రదర్శించగా ఎనిమిదింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.



### స్థానిక సంస్థల ఎన్నికల్లో
# జెండా ఎగురవేద్దాం

**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగుర వేద్దామని బీఆర్ఆస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ నాయకులతో దాదాపు గంటపాటు జిల్లా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో జాన్సన్‌నాయక్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, జీవన్‌రెడ్డి, టీఎల్ఎన్ చారి ఉన్నారు.

# నగదు రహిత లావాదేవీలపై అవగాహన



**జన్నారం, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నగదు రహిత లావాదేవీలపై ప్రజలు ఆసక్తిని పెంచుకోవాలని జన్నారం మండలం తపాలాపూర్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రమోద్, దండేపల్లి సీఎఫ్ఎల్ కౌన్సిలర్ వేల్పుల రవీందర్ అన్నారు. గురువారం రోటిగూడ గ్రామంలో ప్రజలతోపాటు ఖాతాదారులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బ్యాంకులు అత్యంత సురక్షితమైనవని తెలిపారు. బ్యాంకుల ద్వారా వివిధ రుణాలు, ఇన్సూరెన్స్ తదితర సేవలు అందిస్తున్నామని చెప్పారు.

# అవార్డు గ్రహీతకు సన్మానం

**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును నిర్మల్ జిల్లా ట్రస్మా సంఘంకి చెందిన సభ్యులు శ్రీ శ్యామ్ ప్రకాష్, ముజీబ్ కద్రి అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ వారిని ట్రస్మా సంఘం తరుపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు అబ్బాస్, ఈసీ మెంబర్ షబ్బీర్ పాల్గొన్నారు.

# విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**డీఈవో యాదయ్య కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల తనిఖీ**

**భీమిని, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, వడాల, కేస్లాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. కస్తూర్బా పాఠశా లలో తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వంటగది, కూరగాయల నిల్వల ను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పాఠశాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం వడాల, కేస్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయపాలన పాటించా లని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం లో భాగంగా ప్రతిరోజు తప్పకుండా మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.








# నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి
- బాసర ఆలయాధికారులతో కలెక్టర్ సమీక్ష
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రం బాసరలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజల అభ్యున్నతి కోసం అమ్మవారిని ప్రార్థించిన కలెక్టర్‌కు దేవస్థానం అర్చకులు ఆశీర్వచనం అందించి, సాంప్రదాయరీతిలో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ పరిసరాలను అధికారులు, పూజారులతో కలిసి పరిశీలించారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. క్యూ లైన్లు, వి ఐ పి క్యూ లైన్స్, అక్షరాభ్యాసం మండపాలు, దర్శనం, లడ్డు కౌంటర్లు, సీసీటీవీ కెమెరాలు, అన్నదానం, తాగునీరు, వసతి వంటి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్, సెక్యూరిటీ, శానిటేషన్, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. లైటింగ్, పార్కింగ్, పూల అలంకరణ, పెయింటింగ్, నిరంతరం సానిటేషన్, మొబైల్ టాయిలెట్, వైద్య శిబిరం, పోలీస్ సెక్యూరిటీ, గోదావరి ఘాట్స్ వద్ద సౌకర్యాలు వంటి ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రహదారులను తక్షణం మరమ్మతులు చేయడంతో పాటు, ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, దసరా నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రద్దీ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్ పటాక్, ఏ ఎం సి చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సబ్ కలెక్టర్, ఆలయ ప్రత్యేక అధికారి సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజని దేవి, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ పవనచంద్రతో పోలీస్, ఫైర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ బ్యాంక్‌లో స్కామ్.. నిందితులతో సీన్ రీ కన్స్ట్రక్షన్

**చెన్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలోనే ఎంతో సెన్సేషనల్‌గా మారిన ఎస్‌బీఐ బ్రాంచ్ టు లో జరిగిన బంగారము, నగదు స్కామ్ లో ప్రధాన నిందితులతో ఏసీపీ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సీనరీ కన్స్ట్రక్షన్ నిర్వహించారు. గత నెలలో జరిగిన బ్యాంక్ స్కామ్ లో 20 కిలోల బంగారంతో పాటు రూ.లక్ష 16 వేల నగదు బ్యాంకులో పనిచేస్తున్న సిబ్బంది అపహరించారు. పోలీసులు పురోగతి సాధించి బంగారం, నగదు స్వాధీనపరుచుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో బ్యాంకు అధికారులతో పాటు మొత్తం 44 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. కస్టడీలో ఉన్న ప్రధాన నిందితులు బ్యాంకు మేనేజర్ మనోహర్ రెడ్డి, క్యాషియర్ నరిగ రవీందర్, తాత్కాలిక ఉద్యోగి లక్కాకుల సందీప్ లను బ్యాంకులో ఎలా చోరీకి పాల్పడ్డారో అని సీన్ రీకన్స్ట్రక్షన్ చేస్తూ వీడియోలు రికార్డులు చేస్తూ విచారణ చేపట్టారు.



**మా బంగారం మాకు ఇప్పించండి ఖాతాదారులు..**

బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి లోన్లు తీసుకున్న ఖాతాదారులు తమ బంగారం తమకు ఇప్పియ్యాలంటూ బ్యాంకు ముందు ఆందోళనకు దిగడంతో స్థానిక పోలీసులు వారికి నచ్చజెప్పి బ్యాంకు అధికారులతో మాట్లాడి వెంటనే ఖాతాదారులకు న్యాయం చేస్తామన్నారు. దీంతో ఖాతాదారులు ఆందోళన విరమించారు.

## నర్సాపూర్ కార్యదర్శి సస్పెండ్

**ఇచ్చోడ, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్ పంచాయతీ కార్యదర్శి సునీల్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్‌లో విచారణ చేపట్టిన కొన్ని గంటలకే కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

## ఏఎస్పీ కాజల్ సింగ్‌కు పదోన్నతి



**ఉట్నూర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. యథాస్థానంలో పోస్టింగ్ కల్పించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
• ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి •
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

వన్యప్రాణుల సంరక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ పాటుపడాలని జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్ కుమార్ అన్నారు. డీపీవో కార్యాలయంలో గురువారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గదిని ప్రారంభిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తో కలిసి వన్యప్రాణులకు సంబంధించిన కేసులలో శిక్షలకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వన్యప్రాణులను వేటాడే కేసులో నిందితులకు త్వరగా శిక్షపడేలా చూడాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు పోటీసులు, అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ వన్యప్రాణుల సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహిస్తూ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖదేవ్, ముసవీర్, ఝాన్సీరాణి పాల్గొన్నారు.



## వందేభారత్ హాల్టింగ్‌ను ప్రారంభించిన ఎంపీ



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

వందేభారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌ను గురువారం కాగజ్‌నగర్‌లో ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేరుగాంచిన వందేభారత్ రైలు కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇచ్చేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రితో చర్చించామని అన్నారు. కాగజ్‌నగర్ వాసులకు ఎంత ఉపయోగంగా ఉండే ఈ రైలు హాల్టింగ్ నిరీక్షణకు తెరపడినట్టు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంస్కరణల ఫలితంగానే నూతన రైళ్లు వచ్చినట్టు చెప్పారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే ఈ రైలు ఇటీవల మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు హాల్టింగ్ ఇచ్చారని, ఇప్పుడు కాగజ్‌నగర్‌కు కూడా వచ్చిందని తెలిపారు. కాగజ్‌నగర్‌కు మరిన్ని రైళ్లను హాల్టింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నాయకత్వంలో రైల్వేలు అపూర్వరమైన అభివృద్ధిని సాధిస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు రూ.60 కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమని అన్నారు. కాగజ్‌నగర్ నుంచి కొల్‌కత్తా వెళ్లేందుకు, కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు మరో రైలు స్పెషల్ రైలు వేయాలని కోరారు. సిర్పూరు(టి) రైల్వేస్టేషన్‌ను ప్యాసింజర్, ఇతర రైళ్లను హాల్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.గోపాల్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం పాల్గొన్నారు.

## 23న మంచిర్యాలకు కవిత రాక

**మంచిర్యాల, సెప్టెంబర్ 18 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు సింగరేణిలో హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత ఈనెల 23న మంచిర్యాల జిల్లాకు రానున్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఆ వేడుకల్లో పాల్గొనేందుకు కవిత హాజరవుతున్నట్లు హెచ్‌ఎంఎస్ వర్గాలు తెలిపాయి. భారీ ఎత్తున నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల్లో ఆమె పాల్గొనబోతుండడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అదే రోజున ఆమె తల్లిగారి ఊరైన చింతమడకలో కూడా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటారని సమాచారం. అక్కడ కొద్ది సమయం మాత్రమే ఉంటారని మిగతా సమయం అంతా శ్రీరాంపూర్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటారని ఆమె సన్నిహిత వర్గాలు తెలిపాయి. కాగా శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతంలో కొంత కవితకు పట్టు ఉంది ఇదే క్రమంలో ఆమె హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షురాలుగా నియామకం ఆయన నేపథ్యంలో బతుకమ్మ కార్యక్రమం కార్యకలాపాలు మరింత విస్తరించవచ్చన్న వ్యూహంలో భాగంగా కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి హెచ్‌ఎంఎస్ నేత రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.